www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 92 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com ఆదివారం 19 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



హైదరాబాద్ కేబీఆర్ పార్కులో భారీ కొండచిలువ



## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- వైసీపీ అధినేత జగన్
- గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం
- బుధవారం ఘటన జరిగితే మూడు రోజులు కప్పిపుచ్చారని ఆరోపణ
- ఇదేనా సుపరిపాలన, మహిళా భద్రత అంటూ సర్కారుకు ప్రశ్నలు
- మహిళల ఆగ్రహం ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని హెచ్చరిక

**అమరావతి :**

గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ - మిగతా 2 లో

## 'చెత్త నుంచి సంపద సృష్టి'

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాష్ట్రంలో అక్టోబరు 2 నాటికి చెత్త లేకుండా చేస్తాం
- ఇంట్లో ఎవరికివారే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలి
- తడి చెత్తను కంపోస్ట్‌గా తయారుచేసుకోవాలి
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు




**అమరావతి :**

చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి లక్ష్యం అని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో అక్టోబరు 2 నాటికి చెత్త లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. ఇంట్లో ఎవరికివారే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని సూచించారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలన్నారు. శాశ్వతంగా చెత్త నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించిన చంద్రబాబు, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ గ్రౌండ్‌లోని ప్రజావేదిక సభలో పాల్గొని మాట్లాడారు. "చెత్త పేరుకుపోవడం వల్ల అనేక రోగాలు వస్తాయి. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం పెట్టాం. చాలామంది ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో పాల్గొన్నారు. 12 ఏళ్ల ముందు కృష్ణా డెల్టాకు నీళ్లు వచ్చేవి కావు. - మిగతా 2 లో

## టీడీపీ నేతపై వేటు.. చట్టం ముందు ఎవరైనా సమానమేనన్న సీఎం చంద్రబాబు



- గుంటూరులో మహిళపై దాడి ఘటనపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం
- నిందితుడైన టీడీపీ నాయకుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం
- చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- నిందితుడిని అరెస్ట్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసిన పోలీసులు
- మహిళల భద్రతపై రాజీ లేదని ప్రభుత్వ స్పష్టమైన హెచ్చరిక

**అమరావతి :**

గుంటూరులోని కృష్ణబాబు కాలనీలో ఓ మహిళపై జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నిందితుడు అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడని తేలినప్పటికీ, చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేస్తూ కఠిన చర్యలకు ఉపక్రమించింది. - మిగతా 2 లో

# భారత్‌ను గర్వపడేలా చేశారు



- విక్రమ్-1 సక్సెస్ తర్వాత స్కైరూట్‌కు మోదీ ఫోన్!
- విక్రమ్-1 విజయంపై స్కైరూట్‌కు మోదీ ఫోన్
- 'భారత్‌ను గర్వపడేలా చేశారు' అంటూ ప్రశంస
- స్కైరూట్ టీమ్ సగటు వయసు 28 ఏళ్లని పవన్ వెల్లడి
- విక్రమ్-1తో అంతరిక్షంలోకి మోదీ రాసిన 'వందేమాతరం' సందేశం


**ఢిల్లీ :**

భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందానికి ఫోన్ చేసి అభినందించారు. సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంబరాలు జరుగుతున్న సమయంలో వచ్చిన ఈ కాల్‌లో యువ శాస్త్రవేత్తల కృషిని ప్రధాని ప్రశంసించారు. స్కైరూట్ - మిగతా 2 లో

## భారత అంతరిక్ష

# చరిత్రలో నవశకం

- తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్
- భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి
- శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం
- ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన 'విక్రమ్-1'



**ఢిల్లీ :**

భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) - మిగతా 2 లో

## జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత.. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడిపై ఇంక్ లాంటి ద్రవం చల్లిన మహిళ


- సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఆందోళన ఉద్రిక్తం
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే ఆమరణ నిరాహార దీక్ష
- ప్రసంగిస్తున్న సమయంలో డిప్కేపై గుర్తుతెలియని మహిళ ఇంకు దాడి



**ఢిల్లీ :**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం నిరసనలు మరింత ఉద్రిక్తంగా మారాయి. గత 21 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించిన కొద్ది గంటలకే, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. వాంగ్‌చుక్‌ను పోలీసులు - మిగతా 2 లో

## 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు




- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్
- తెలుగులో ఉత్తమ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'
- ఉత్తమ చిత్రంగా 'ఆర్టికల్ 370', ఉత్తమ నటిగా యామీ గౌతమ్
- 'పుష్ప 2', 'కల్కి', 'లక్కీ భాస్కర్' చిత్రాలకు పలు విభాగాల్లో అవార్డులు

## ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క



- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- ఉద్యోగాలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- 70 వేల ఉద్యోగాలపై బహిరంగ సవాల్
- నోటిఫికేషన్లు కాదు.. లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శ
- హామీలు నెరవేర్చకపోతే యువతే తీర్పు చెబుతుందన్న వ్యాఖ్య
- యువ సంగ్రామ సదస్సులో మాట్లాడిన కేటీఆర్



## ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తాం


- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
- పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి

**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. - మిగతా 2 లో

# అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతి వనానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- 16 ఏళ్ల తర్వాత తాము అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించామన్న సీఎం
- అందెశ్రీ సమాధి వద్ద నివాళులు
- మేకతోలు కప్పుకున్న తోడేలు ఇవాళ బయటికొచ్చిందన్నారు



**హైదరాబాద్ :**

మేకతోలు కప్పుకున్న తోడేలు ఇవాళ బయటికొచ్చిందని, మాజీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే, ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని చెబుతున్నారని కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగ నియామకాల గురించి ఒక్కరోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిరుద్యోగులను ఎప్పుడైనా మనుషులుగా చూశారా అని నిలదీశారు. 16 ఏళ్ల తర్వాత తాము అధికారంలోకి వచ్చాక, గ్రూప్-1 నిర్వహించామని, బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని, తల్లిదండ్రుల సాక్షిగా 70 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలిచ్చామని సీఎం వెల్లడించారు. అందెశ్రీ తనకు - మిగతా 2 లో

# సంపాదకీయం

## ద్వంద్వ యుద్ధాలు!




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ కయ్యానికి కాలుదువ్వడంతో చమురు తిరిగి భగ్గుమంటోంది. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు, యుద్ధం తీవ్రరూపం దాల్చుతుందన్న ఆయన హెచ్చరికలతో ముడిచమురు సరఫరాలు తగ్గుతున్నాయి, ధర పెరుగుతోంది. ఇరాన్ దిగిరాకపోతే రాబోయేరోజుల్లో ఆ దేశ విద్యుత్ కేంద్రాలు, రవాణామార్గాలన్నింటినీ ధ్వంసం చేస్తానని హెచ్చరించారు ట్రంప్. ఇరాన్ రవాణా నౌకలపై నిర్బంధం విధించిన ఆయన, ఆ జలసంధినుంచి వెళ్ళే సరుకు రవాణానౌకలపై 20శాతం పన్ను విధించాలని నిర్ణయించి, ఇరవైనాలుగుగంటల్లోనే ఆ ఆలోచనను విరమించుకొని, దీనిని తన దేశంలో అరబ్‌దేశాల పెట్టుబడులతో ముడిపెట్టారు. అమెరికా--ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం భగ్నం కావడం, హోర్ముజ్ మీద రెండుదేశాలూ పట్టుబిగిస్తున్న క్రమంలో అది మళ్ళీ యుద్ధకేంద్రంగా మారిపోవడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాత్కాలిక శాంతి ఒప్పందంతో హెచ్చిన ముడిచమురు సరఫరాలకు తిరిగి అడ్డంకులు మొదలైనాయి.హోర్ముజ్ నుంచి ముడిచమురు రాకడకు ముప్పు ఏర్పడుతున్న తరుణంలోనే, ట్రంప్ ప్రోద్బలంతో అమెరికా చట్టసభల్లోకి ఒక బిల్లు ప్రవేశించి, మనను శిక్షించడానికి సిద్ధపడుతోంది. ట్రంప్ సన్నిహితుడూ, ఇటీవల రక్తనాళం తెగి అనుమానస్పదస్థితిలో మరణించిన లిండ్సే గ్రాహమ్ ఈ బిల్లు సృష్టికర్త. రష్యానుంచి చమురు కొంటున్న ఐదుదేశాలమీద నూరుశాతం సుంకాలు విధించి, వాటిని నిలువరించాలన్నది గ్రాహమ్ ఆశయం. ప్రధానంగా భారత్, చైనాలు భారీగా రష్యన్ చమురు దిగుమతి చేసుకొని ఉక్రెయిన్‌పై యుద్ధానికి కావాల్సినంత సొమ్మును పుతిన్‌కు సమకూరుస్తున్నాయి కనుక, రష్యన్ క్రూడ్‌వైపు ఈ దేశాలు కన్నెత్తకుండా చేయడానికి ఈ సుంకాల శిక్ష ఉపకరిస్తుందని ఈ బిల్లు సమర్థకుల నమ్మకం. శాంక్షనింగ్ రష్యా యాక్ట్‌లో ప్రతిపాదిత సుంకాల గరిష్ఠపరిమితిని ఐదువందల నుంచి ఇప్పుడు వందశాతానికి తగ్గించడం మిత్రదేశాలమీద ట్రంప్‌కు ఉన్న ప్రేమే కారణమని కొందరు చెప్పుకుంటున్నారు. ఈ ఎకనమిక్ బంకర్ బస్టర్ దెబ్బకు రష్యన్ కులీనులు, ఆర్థికసంస్థలు, ఇంధన ప్రాజెక్టులు అన్నీ చతికిలబడి, రష్యన్ చమురు దిగుమతి చేసుకొనే దేశాలు ఉక్కిరిబిక్కిరవుతాయని బిల్లు సమర్థకుల నమ్మకం. రష్యానుంచి గ్యాస్ కొంటున్న యూరోపియన్ దేశాలకు, దిగుమతులు ఇంకా తగ్గించుకుంటామని హామీ ఇచ్చిన జపాన్ వంటి దేశాలకు ఈ బిల్లు చాలా మినహాయింపులు ఇచ్చింది.నిన్నటివరకూ మిగతాదేశాలను లొంగదీయడానికి అధ్యక్షహోదాలో ప్రతీకార సుంకాలు విధించి న్యాయస్థానాలతో మొట్టికాయలు తిన్న ట్రంప్‌కు ఈ బిల్లును అమెరికన్ కాంగ్రెస్ ఆమోదిస్తే ఎనలేని అధికారాలు దఖలుపడతాయి. అమెరికా ప్రయోజనాలు, సంక్షేమం దృష్ట్యా ఈ అదనపు సుంకాలనుంచి కొన్ని దేశాలకు మినహాయింపులు ఇచ్చే అధికారం కూడా అధ్యక్షుడికి ఉంటుంది కనుక, ఈ దారిని కూడా ఆయన మిత్రదేశాలను వాణిజ్య ఒప్పందాలకు లొంగదీయడానికి ఉపయోగించవచ్చునని కొందరి అనుమానం. భారత్ ముడిచమురు దిగుమతుల్లో యాభైశాతం రష్యానుంచే జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ బిల్లు భారత్‌కు సమస్యాత్మకమే. జూన్‌లో రష్యా నుంచి 26లక్షల బ్యారెళ్ళ ముడిచమురు దిగుమతి అయిందనీ, ఈ నెలలో దానిని మించిపోతుందని ఓ లెక్క. ఇరాన్‌మీద యుద్ధం ఆరంభంకాగానే, అమెరికా అధ్యక్షుడే రష్యన్ చమురు దిగుమతుల మీద ఆంక్షలు సడలించి, మినహాయింపులు ఇవ్వడంతో ప్రపంచ చమురు మార్కెట్లు తిరిగి కాస్తంత నిలదొక్కుకున్నాయి. మార్కెట్ నుండి రోజూ లక్షలాది బ్యారెళ్ళు మాయమైపోతే ఏమి జరుగుతుందో ప్రపంచం గతంలో చూసింది. ముడిచమురు సరఫరాలకు తీవ్ర అంతరాయం నెలకొన్న ప్రస్తుత కాలంలో, రష్యా చమురు ఎగుమతులను సైతం దెబ్బతీయాలనుకోవడం సరికాదు. భారత్--అమెరికాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకోబోతున్న తరుణంలో ఈ బిల్లు తెరమీదకు వచ్చింది. ఇది చట్టంగా మారుతుందా లేదా అన్నది అటుంచితే, సదరు బిల్లుకూ, కుదరబోయే ఒప్పందానికీ సంబంధం లేదన్న తరహాలో మన నాయకులు మాట్లాడటం సరికాదు. భారతదేశం తన ముడిచమురు దిగుమతుల్లో కోతలను భరించగలిగే స్థితిలో లేదు, రష్యన్ చమురుకు ప్రత్యామ్నాయం కూడా లేదు. ఇంధనభద్రత విషయంలో రాజీపడే సమస్య అంతకన్నా లేదు.

## ‘చెత్త నుంచి సంపద సృష్టి’ కూటమి ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** కృష్ణా జిల్లా దేశానికి అన్నం పెట్టిన స్థలం. కవుల నుంచి హీరోల వరకు ఎంతోమంది ఈ గడ్డమీద పుట్టినవారే. 12 ఏళ్లలో ఎంతో కృషి చేసి పట్టిసీమ నుంచి కృష్ణా జిల్లాకు నీరు తెచ్చాం. వానలు లేక ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయి.రాష్ట్రంలో కాలుష్యం లేకుండా చేస్తాం. చాలామంది పంటలకు క్రిమిసంహారక మందులు వాడడం లేదు. ముందుచూపుగా ఆలోచించి ప్రకృతి సేద్యాన్ని తీసుకొచ్చాం. పీఎం కిసాన్ కింద ప్రతిఏటా రైతుల ఖాతాల్లో రూ.20 వేల వరకు జమ చేస్తున్నాం. స్త్రీ శక్తి కింద మహిళలకు ఉచిత బస్సు తీసుకొచ్చాం. ఈనెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తాం. ప్రజలను చైతన్యవంతులు చేసి ఉపాధి కల్పిస్తున్నాం. అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తాం. త్వరలో అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికుల అకౌంట్లలో డబ్బులు వేస్తాం” అని సీఎం చంద్రబాబు తెలిపారు.“ప్రతిఇంటికి కుళాయి ఇవ్వడానికి రూ.23 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. వాటర్ సప్లై కోసం రూ. 10 కోట్లు వరకు ఖర్చు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో గుడివాడలో రూ.162 కోట్లు ఖర్చు పెడతాం. అందరి భాగస్వామ్యంతో అనేక పనులు పూర్తవుతాయి. గుడివాడ ప్రజలు బంపర్ మెజారిటీతో కూటమిని గెలిపించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకెళ్తున్నాం. రాజకీయాల్లో క్రిమినల్స్ మారరు, మనం మార్చితే తప్పా మారరు. డిప్యూటీ సీఎం కుటుంబంపై అనరాని మాటలు అన్నారన్న సీఎం చంద్రబాబు.

## భారత్‌ను గర్వపడేలా చేశారు

**మొదటిపేజీ తరువాయి -** సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్‌తో మాట్లాడిన మోదీ.. “మీరు భారత్‌ను గర్వపడేలా చేశారు. భారత ఆశయాలను అంతరిక్షంలో నిలబెట్టారు. యువత కలలకు బలమైన పునాది వేశారు” అని అన్నారు. భారత యువతపై తనకున్న నమ్మకాన్ని ఈ బృందం నిజం చేసిందని కొనియాడారు.దీనికి పవన్ స్పందిస్తూ.. తమ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. భారత యువతను నమ్మితే అద్భుతాలు చేయగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ఈ చారిత్రక క్షణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతోనే ఫోన్ చేసినట్లు చెప్పారు.‘ఆగమన్’ పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం మాత్రమేనని, ముందు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ తొమ్మిది నిమిషాల సంభాషణలో భారత అంతరిక్ష రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లినందుకు బృందాన్ని అభినందించారు.ప్రయోగానికి ముందు ప్రధాని చేతిరాతలో పంపిన ‘వందేమాతరం’ సందేశాన్ని విక్రమ్-1తో పాటు అంతరిక్షంలోకి తీసుకెళ్లినట్లు పవన్ తెలిపారు. దీనిపై స్పందించిన మోదీ.. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలిచే సందేశం కావడంతోనే ఆ పదాలను రాశానన్నారు. చివరగా “ముందుకు సాగండి... మరింత ఎత్తుకు ఎగరండి... నేను మీ వెంటే ఉంటాను” అంటూ స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత.. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడిపై ఇంక్ లాంటి ద్రవం చల్లిన మహిళ

**మొదటిపేజీ తరువాయి -** బలవంతంగా, అనుచిత రీతిలో తరలించారని ఆరోపిస్తూ అభిజీత్ ఈ నిర్ణయం తీసుకున్నారు.శనివారం తెల్లవారుజామున వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వైద్య నిపుణుల సలహా మేరకు పోలీసులు ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. అయితే, నిరసనకారులు అప్రమత్తంగా లేని సమయంలో పోలీసులు వాంగ్‌చుక్‌ను బలవంతంగా తీసుకెళ్లారని సీజేపీ ఆరోపించింది. ఈ క్రమంలో తనకు కూడా గాయాలయ్యాయని అభిజీత్ పేర్కొన్నారు. అనంతరం మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, తాను ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.అభిజీత్ వేదికపై ప్రసంగిస్తున్న సమయంలో ఒక గుర్తుతెలియని మహిళ ఆయనపై సిరా వంటి ద్రవాన్ని విసిరింది. దీంతో అక్కడ ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. వెంటనే స్పందించిన పోలీసులు సదరు మహిళను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఎన్ని దాడులు జరిగినా తాము భయపడబోమని, తామంతా బాబాసాహెబ్ బిడ్డలమని సీజేపీ సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసింది.నీట్-యూజీ పేపర్ లీక్ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, జూన్ 20 నుంచి సీజేపీ జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# టీడీపీ నేతపై వేటు.. చట్టం ముందు ఎవరైనా సమానమేనన్న సీఎం చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి - ౧** ఈ ఘటనలో ప్రమేయమున్న టీడీపీ నాయకుడిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయించింది. మహిళల భద్రత విషయంలో తమ ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ఈ చర్యల ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపింది.ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ‘ఎక్స్’ వేదికగా ఆయన స్పందిస్తూ.. “ఏ మహిళనైనా అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం. ఇలాంటి ఘటనలకు మన సమాజంలో తావు లేదు” అని హెచ్చరించారు. ఘటనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ పార్టీల పేరు చెప్పుకుని అరాచకాలకు పాల్పడాలనుకునే వారికి ఎలాంటి రక్షణ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మహిళకు గౌరవం, భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు.మరోవైపు ఈ ఘటనపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నిందితుడిపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. దాడికి పాల్పడిన వ్యక్తిని పార్టీ పదవుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. “రాజకీయ అండ లేదా పార్టీ అనుబంధం చట్టం నుంచి ఎవరినీ కాపాడదు. మహిళలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. నిందితులు ఎవరైనా చట్టం ముందు సమానమే” అని లోకేశ్ ఘాటుగా స్పందించారు.ఈ వ్యవహారంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కూడా తక్షణమే స్పందించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆమె ఆదేశించారు. అంతేకాకుండా ఈ కేసు దర్యాప్తులో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా సంబంధిత అధికారులపైనా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించడం గమనార్హం.మొత్తం మీద గుంటూరు ఘటనలో నిందితుడు సొంత పార్టీకి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించకుండా వేగంగా చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రుల వరకు ఒకే స్వరంతో స్పందించడం, తప్పు చేసిన వారికి రాజకీయ రక్షణ ఉండదనే బలమైన సందేశాన్ని ప్రజల్లోకి పంపడం ద్వారా మహిళల భద్రత పట్ల తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకున్నారు.

# మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

**మొదటిపేజీ తరువాయి -**

ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు.ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు.ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.“అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది” అని ఆయన తీవ్రంగా విమర్శించారు.అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు.ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. “చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది” అని ఆయన హెచ్చరించారు.

# భారత అంతరిక్ష చరిత్రలో నవశకం

**మొదటిపేజీ తరువాయి -** నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది.‘మిషన్ ఆగమన్’ పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

### ‘విక్రమ్-1’ ప్రత్యేకతలు

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది.ఈ తొలి ప్రయోగంలో గ్రాహ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన ‘స్కోప్’ ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన ‘వందేమాతరం’ పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి.ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికే పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజినీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది.ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలు అందించడమే లక్ష్యంగా వారు ఈ సంస్థను ప్రారంభించారు. 2022లో ‘విక్రమ్-ఎస్’ అనే సబ్-ఆర్బిటాల్ రాకెట్‌ను ప్రయోగించి, అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజా విజయంతో భారత అంతరిక్ష యానంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఒక కీలక శక్తిగా నిలిచింది.

# 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు

**మొదటిపేజీ తరువాయి -** భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం న్యూఢిల్లీలో ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ అవార్డులలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి మరోసారి తన నటనతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. ‘భ్రమయుగం’ చిత్రంలో ప్రదర్శించిన అద్భుత నటనకు గాను ఆయన ఉత్తమ నటుడిగా నిలిచారు. ఆయనతో పాటు ‘చందు ఛాంపియన్’ చిత్రానికి కార్తీక్ ఆర్యన్ కూడా ఈ పురస్కారాన్ని సంయుక్తంగా గెలుచుకున్నారు. ఉత్తమ నటిగా బాలీవుడ్ భామ యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) ఎంపికయ్యారు. అదే సమయంలో, చిన్న సినిమాగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన ‘కమిటీ కుర్రోళ్లు’ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికై తెలుగు సినిమా గౌరవాన్ని ఇనుమడింపజేసింది.ఈ ఏడాది అవార్డులలో కంటెంట్ ఆధారిత చిత్రాలతో పాటు కమర్షియల్ చిత్రాలు కూడా సత్తా చాటాయి. బాలీవుడ్ చిత్రం ‘ఆర్టికల్ 370’ ఏకంగా మూడు ప్రధాన పురస్కారాలను కైవసం చేసుకుంది. ఈ చిత్రం ఉత్తమ చిత్రంగా నిలవడమే కాకుండా, ఇందులో అద్భుత నటన కనబరిచిన యామీ గౌతమ్‌ను ఉత్తమ నటి పురస్కారం వరించింది. ఇదే చిత్రానికి శశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు.

### ప్రధాన పురస్కారాల విజేతలు:

ఉత్తమ చిత్రం: ఆర్టికల్ 370
ఉత్తమ నటులు: మమ్ముట్టి (భ్రమయుగం), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్)
ఉత్తమ నటి: యామీ గౌతమ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ దర్శకుడు: రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్)
ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: కల్కి 2898 ఏడీ

### తెలుగు సినిమాకు అవార్డుల పంట

ఈసారి జాతీయ అవార్డులలో తెలుగు చిత్ర పరిశ్రమ పలు విభాగాల్లో తనదైన ముద్ర వేసింది. ‘కమిటీ కుర్రోళ్లు’ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలవడమే కాకుండా, ఈ చిత్రానికి పనిచేసిన పి. రవికుమార్‌కు ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు లభించడం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో విడుదలై విజయం సాధించిన ‘కల్కి 2898 ఏడీ’ ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపికైంది. దీంతో పాటు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ (నితిన్ జిహానీ చౌదరి) అవార్డును కూడా గెలుచుకుంది.‘పుష్ప 2’ చిత్రం కోసం దర్శకుడు సుకుమార్ ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే రచయితగా పురస్కారం అందుకోగా, ఇదే చిత్రానికి దీపాలి నూర్, శీతల్ శర్మ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా నిలిచారు. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ‘లక్కీ భాస్కర్’ చిత్రానికి గాను దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ అవార్డును గెలుచుకున్నారు. ఇక ‘35 ఇది చిన్న కథ కాదు’ చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవగా, అందులో నటించిన పలువురు బాల నటులకు కూడా అవార్డులు దక్కాయి.

# అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం

**మొదటిపేజీ తరువాయి -**

ఆత్మ బంధువన్న సీఎం రేవంత్ రెడ్డి, అందెశ్రీ జయంతి సందర్భంగా ఆయన స్మృతి వనానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. తెలంగాణ సమాజానికి ప్రముఖ కవిగా, గాయకుడిగా అందెశ్రీ సుపరిచితులని, అందెశ్రీ జయంతి కార్యక్రమానికి వారి కుటుంబసభ్యులను ఆహ్వానించామని అన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. అందెశ్రీ సమాధి వద్ద సీఎం, మంత్రులు నివాళు లర్పించారు.“కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. నిజాంరాజును మించిన ధనవం తులుగా మీరు ఎలా మారారు. కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా. నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. నిజాం వారసులకే ఇప్పుడు దిక్కులేదు. ఇక నీ కుటుంబం ఎంత. గుర్తుపెట్టుకోండి మీ కుటుం బం బిచ్చమెత్తుకుని బతకాల్సి వస్తుంది. చర్చకు రమ్మంటే రారు. ఇంట్లో పడుకుంటారు. తెలంగాణను దోచుకోవాలని చూస్తే అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడు. అందెశ్రీ తెలంగాణ ఉద్యమకారుడిగా అందరికీ పరిచయమని, అందెశ్రీని తన కుటుంబసభ్యుడిగా, పెద్దన్నగా భావించానని సీఎం తెలిపారు. గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని కొనియాడారు. అందెశ్రీ, గద్దరన్న లాంటి వారితో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారని, అందెశ్రీ, గద్దర్‌ను అవమానిం చినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయిం చుకున్నారని అన్నారు. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందని, గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ముందు ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ సాధనకు ఎందరో ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ దొరలకు కనీసం చిన్న గీతైన పడిందా ప్రాణత్యాగం చేసి తెలంగాణను తెచ్చిన వారి కుటుంబాలను ఆదుకున్నావా అని నిలదీశారు. ఎందరు ఉద్యమకారులను గౌరవించామో లెక్క తీయలాని కోరారు. విప్లవాలకు అంకితం చేసిన 9 కుటుంబాలను గుర్తించి వారిని ఆదుకున్నామని హామీ ఇచ్చారు.


## ‘ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క’

**మొదటిపేజీ తరువాయి -**

తెలంగాణలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఉద్యోగ ‘నోటిఫికేషన్ల’ స్థానంలో ‘లూటిఫికేషన్లు’ చేస్తున్నారని విమర్శించారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన ‘యువ సంగ్రామ’ సదస్సులో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “రేవంత్ గుర్తు పెట్టుకో.. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది” అని హెచ్చరించారు.‘‘ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క. కాంగ్రెస్ ప్రభుత్వానికి యువతే తగిన గుణపాఠం చెబుతుంది. ప్రజలు, నిరుద్యోగ యువత ఈ అవమానాలను ఎప్పటికీ మర్చిపోరు” అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అశోక్‌నగర్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఉద్యోగాల క్యాలెండర్‌ను పక్కనపెట్టి జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు.ప్రభుత్వం చెబుతున్నట్లు 70 వేల ఉద్యోగాలు నిజంగానే ఇచ్చి ఉంటే.. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లతో సహా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అలా నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని రాహుల్ గాంధీకి జై కొడతానని ప్రకటించారు. ఈ సభ కాంగ్రెస్ చేసిన ‘మహాద్రోహాన్ని’ యువతకు గుర్తు చేసేందుకేనని అన్నారు.ఉద్యోగాలు అడిగిన యువతపై పోలీసులు దాడులు చేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారంతో వ్యవహరిస్తోందని విమర్శించారు.కేసీఆర్ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకే ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. ఒక మంత్రి ఒక మాట, మరో మంత్రి మరో మాట చెబుతూ ఉద్యోగాల విషయంలో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక లూటీ జరుగుతోందని, ప్రజలు హామీల గురించి ప్రశ్నిస్తే వారిని అవమానిస్తున్నారని విమర్శించారు.

## ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు



శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

www.akshratimes.com

తెలుగు దినపత్రిక అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# చర్లపల్లిలో ఓటరు అవగాహన ప్రచారానికి శ్రీకారం

### ప్రతి ఓటు విలువైనదే.. ప్రజలకు ఎమ్మెల్యే పిలుపు






**చర్లపల్లి,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే బలమైన పునాది అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు చొరవ చూపాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. చర్లపల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నేమూరి మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటు హక్కు కేవలం ఎన్నికల్లో ఓటు వేయడానికి మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఇటీవల 18 సంవత్సరాలు నిండిన యువత వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు తమ పేరు, చిరునామా, కుటుంబ వివరాలు, ఇతర సమాచారం సక్రమంగా ఉన్నాయో లేదో ధృవీకరించుకోవాలని సూచించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మారిన వారు చిరునామా సవరణ చేసుకోవాలని, పేర్లలో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నిర్లక్ష్యం కారణంగా ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోయే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. ప్రజల్లో అపోహలు, అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ ప్రచార రథం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. చర్లపల్లి డివిజన్‌లోని ప్రతి కాలనీ, బస్తీ, వీధిని సందర్శిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలపై ప్రజలకు వివరాలు అందజేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నేమూరి మహేష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి అర్హుడి ఓటు ప్రజాస్వామ్యానికి అమూల్యమైనదని, ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ఉండేందుకు పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తూ ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో స్థానిక నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ప్రజలను నేరుగా కలిసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రచార రథం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓటరు నమోదు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించింది.

# ప్లాస్టిక్ రహిత చెరువు దిశగా చర్లపల్లి చెరువు..

### జైళ్లశాఖ ఆధ్వర్యంలో శ్రమదానంతో సుందరీకరణకు శ్రీకారం

### పరిశ్రమలు,ప్రజలు, ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ఆదర్శ చెరువు అభివృద్ధి




**చర్లపల్లి,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** పర్యావరణ పరిరక్షణ, చెరువుల సంరక్షణ, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ జైళ్లశాఖ చేపట్టిన చర్లపల్లి చెరువు సుందరీకరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. చర్లపల్లి చెరువును పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన చెరువుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శనివారం భారీ స్థాయిలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), హైడ్రా సంస్థల సహకారంతో జైళ్లశాఖ చర్లపల్లి చెరువును దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రేంజ్ జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్, చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ భరత్ కుమార్, ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, చర్లపల్లి ఐలా ప్రతినిధులు, జైళ్లశాఖ అధికారులు, సిబ్బంది, ఖైదీలు కలిసి స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొన్నారు.శ్రమదానంలో భాగంగా చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించి పరిసరాలను పూర్తిగా శుభ్రం చేశారు. చెరువు ఒడ్డున పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు చుట్టూ పచ్చదనం పెంపు, నడక మార్గాలు, విశ్రాంతి ప్రదేశాలు, పర్యావరణహిత వాతావరణం కల్పించే దిశగా అభివృద్ధి పనులు కొనసాగనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, చర్లపల్లి చెరువును కేవలం శుభ్రపరచడం మాత్రమే కాకుండా, పర్యావరణానికి అనుకూలంగా సుందరీకరించి ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేందుకు జైళ్లశాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, స్థానిక ప్రజలు కలిసి పనిచేస్తే చెరువుల సంరక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు.చర్లపల్లి ఐలా చైర్మన్ కె. గోవిందరెడ్డి మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని అన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒకరోజు శ్రమదానానికి కేటాయించి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో ప్రతి వారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పరిశుభ్రతను ఒక ఉద్యమంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు వేంకటేశం, దేవుల నాయక్, చర్లపల్లి ఐలా వైస్ చైర్మన్ తాటి శ్రీనివాస్, సీఎఐఐ వైస్ ప్రెసిడెంట్ వై. సుధాకర్ రెడ్డి, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, జైళ్లశాఖ సిబ్బంది, ఖైదీలు, చర్లపల్లి ఐలా ప్రతినిధులు తదితరులు పాల్గొని చెరువు పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా "స్వచ్ఛమైన చెరువు – – హరిత భవిష్యత్తు" అనే సందేశాన్ని సమాజానికి చాటుతూ, ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణకు ఒక ఆదర్శ నమూనాగా చర్లపల్లి చెరువు నిలవనున్నట్లు నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### ప్రజల మధ్యకే కాంగ్రెస్..

### చర్లపల్లి సమావేశంలో స్పష్టమైన సందేశం

# చర్లపల్లి కాంగ్రెస్‌లో కొత్త అధ్యాయం

**చర్లపల్లి,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని సమష్టిగా ముందుకు సాగాలని సంకల్పిస్తూ




నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిసింది.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుమూల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక ఆదేశాల






మేరకు నిర్వహించిన ఈ సమావేశానికి చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త హెచ్.ఆర్. మోహన్ అధ్యక్షత వహించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి నాయకుడు ప్రజల మధ్య ఉండి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న తాగునీరు, మురుగునీటి పారుదల, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డివిజన్ అధ్యక్షుడు బొడిగ ప్రభు గౌడ్ పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లతో జరిగిన ఈ సమావేశంలో సీతారాం రెడ్డి, బూడిద శ్రవణ్ కుమార్, బొజ్జ ఆనంద్ రాజ్ గౌడ్, పల్లపు మల్లేష్ తదితర నాయకులు పాల్గొని పార్టీ విస్తరణ, సభ్యత్వ నమోదు, బూత్ స్థాయి కమిటీల బలోపేతం, ప్రజలతో నిరంతర సంబంధాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. నూతన కమిటీ ఎన్నిక ప్రధాన ఆకర్షణ సమావేశంలో చర్లపల్లి డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ప్రధాన ఘట్టంగా నిలిచింది. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న సీనియర్ నాయకులతో పాటు యువతకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా ప్రతి బస్తీ, ప్రతి కాలనీ, ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలపై ప్రత్యేక బాధ్యతలు స్వీకరించారు.

### సీనియర్లు యువత సమన్వయానికి వేదిక

పార్టీ ఆవిర్భావం నుంచి కాంగ్రెస్ జెండాను మోస్తున్న సీనియర్ నాయకులు సమావేశంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. పార్టీ కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తల సేవలను గుర్తు చేస్తూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ పార్టీ మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.మహిళలు, విద్యార్థులు, యువత భారీగా హాజరు సమావేశానికి మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని తీర్మానించారు. విద్యార్థి విభాగం నాయకులు యువశక్తిని కాంగ్రెస్ సిద్ధాంతాల వైపు మళ్లించి పార్టీ విస్తరణకు కృషి చేస్తామని వెల్లడించారు.సమావేశం ముగింపులో పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, చర్లపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరూ పేరు పరిశీలించుకోవాలి: జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** ఓటు ప్రతి ఒక్కరి హక్కు, బాధ్యత అని, అది ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో స్థానిక నాయకుడు పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు



జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నగరపాలక సంస్థ సభ్యుడు దొడ్ల వెంకటేష్



గౌడ్, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఆయన వెంట మియాపూర్ యువ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్ కూడా ఉన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి అసలైన బలం ప్రజలేనని, ఆ ప్రజల శక్తికి ప్రతీక ఓటు హక్కేనని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదని, అది దేశం పట్ల ప్రతి పౌరుడి బాధ్యతతో పాటు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని పేర్కొన్నారు.

### ఓటరు నమోదు కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యాలు:

అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయడం. ఓటరు గుర్తింపు కార్డు వివరాల్లోని తప్పులను సవరించడం. నివాస చిరునామా మార్పులను నమోదు చేయడం. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతను కొత్త ఓటర్లుగా చేర్చడం.

చివరగా, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఆయన విజ్ఞప్తి చేస్తూ.. తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని కోరారు. పేరు లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని, వివరాల్లో మార్పులు ఉంటే సవరించుకోవాలని సూచించారు. అలాగే తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పొరుగువారిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసి ఓటరు నమోదు పట్ల అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## "సర్" ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి

### కాంగ్రెస్ శ్రేణులకు మందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపు..



**ఉప్పల్,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి హరి మోహన్ రెడ్డి)** ఉప్పల్ పరిధిలో సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ భారత్ నగర్ విజేత స్కూల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి గురువారం పరిశీలించారు.నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ ,తుమ్మల దేవి రెడ్డి ,సల్లా ప్రభాకర్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి,అఫ్జల్,బుత్కూరి మదన్ గౌడ్,నవీన్,రామ్ రెడ్డి,రవీందర్ రెడ్డి,కోమట్ రెడ్డి కృష్ణ రెడ్డి,ఇర్షాద్,నయీం,అఫ్రోజ్,ఆసిఫ్, వాహెద్ ,బంటి, ఈశ్వర్, విజయ్, మోసిన్, శ్రీనివాస్, మోహన్ నాయక్,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## యువ సంగ్రామ సదస్సులో పాల్గొన్న శేరిలింగంపల్లి

## బీఆర్ఎస్ నాయకుడు మరబోయిన రవి యాదవ్





**శేరిలింగంపల్లి,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** సారూర్‌నగర్‌లో నిర్వహించిన "యువ సంగ్రామ సదస్సు" కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పెద్ద సంఖ్యలో యువతతో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మరబోయిన రవి యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) యువత, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన యువజన ప్రణాళిక హామీల అమలుపై తన అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడం, నిరుద్యోగ యువత ఆకాంక్షలను నెరవేర్చడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత ముఖ్యమైన బాధ్యత అని ఆయన అన్నారు. యువత భవిష్యత్తుకు సంబంధించిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణ నలుమూలల నుంచి యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపాధి, ఉద్యోగాలు, యువత సంక్షేమానికి సంబంధించిన అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు, శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు బలరామ్ యాదవ్



**కొండాపూర్‌జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని శేర్లింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు బలరామ్ యాదవ్ అన్నారు. శేర్లింగంపల్లి పరిధిలోని కొండాపూర్ విభాగంలో శనివారం నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బలరామ్ యాదవ్ మాట్లాడుతూ... ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయి ఉందో లేదో తప్పనిసరిగా సరిచూసుకోవాలని కోరారు. ఓటు హక్కు లేని వారు కొత్తగా నమోదు చేసుకోవాలని, తప్పులు ఉన్నట్లయితే వివరాలను సవరించుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజ మోహన్ రావు, నాగరాజ్ యాదవ్, సన్నీ యాదవ్, వెంకటేశ్వర్లు, ప్రేమ్ సాయి, మల్లికార్జున్, రవితేజ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యల నివారణకు

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన సైబరాబాద్ సీపీ



**శేరిలింగంపల్లి,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు చేపట్టేందుకు సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్ల జోనల్ కమిషనర్లు, ఇరు జోన్లకు చెందిన ఇంజినీర్లు, డీసీపీ ట్రాఫిక్, ఏడీసీపీ ట్రాఫిక్ సహా ఇతర అధికారులతో కలిసి శనివారం ఆయన ఎలక్షన్ బిల్డింగ్, పిస్తా హౌస్ పరిసర ప్రాంతాల్లోని నీరు నిలిచే ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ కావడానికి గల కారణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షపు నీరు వేగంగా వెళ్లేలా డ్రైనేజ్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, బాటిల్‌నెక్ పాయింట్లను తొలగించడం, కల్వర్టులు, స్టార్మ్ వాటర్ డ్రైన్లను విస్తరించడం, పూడిక (సిల్ట్) మరియు చెత్తను పూర్తిగా తొలగించడం, అవసరమైన చోట్ల అదనపు డ్రైనేజ్ లైన్లను ఏర్పాటు చేయడం వంటి తక్షణ, దీర్ఘకాలిక చర్యలపై సంబంధిత అధికారులతో సీపీ విస్తృతంగా చర్చించారు.

### సీపీ ఆదేశాలు మరియు ముందస్తు ప్రణాళికలు:

సమన్వయ చర్యలు: వర్షాకాలంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను సీపీ ఆదేశించారు. అత్యవసర బృందాలు: నీరు నిలిచే ప్రాంతాల్లో అత్యవసర స్పందన బృందాలు, మోటార్ పంపులు, అవసరమైన యంత్రాలు మరియు సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు. శాశ్వత పరిష్కారం: జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, ఇరిగేషన్, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

### ప్రజా సౌకర్యం:

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వర్షపు రోజులలో ట్రాఫిక్ సాఫీగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలను వేగవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సౌకర్యం, నిరంతర ట్రాఫిక్ నిర్వహణ కోసం సైబరాబాద్ పోలీసులు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ, వర్షాకాల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నారని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

## ముద్రగడ చిత్రపటానికి శ్రద్ధాంజలి
# ఘటించిన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా




**ఏలేశ్వరం,జులై 17 .అక్షర టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఘన నివాళులర్పించారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి కూటమి శ్రేణులతో కలిసి వెళ్లిన ఆమె, ఆయన చిత్రపటాన్ని సందర్శించి అంజలి ఘటించారు. అనంతరం ముద్రగడ తనయులు ముద్రగడ బాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు ముద్రగడ సతీమణి పద్మావతి ని స్వయంగా పరామర్శించి, తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ముద్రగడ పద్మనాభం సేవలను స్మరించుకున్నారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర మనందరి బాధ్యత

**పాటంశెట్టి సూర్యచంద్ర స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి**




**గోకవరం,జులై 17 .అక్షర టైమ్స్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర పిలుపునిచ్చారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా, గ్రామంలో పలు ప్రాంతాల్లో చెత్త, మురుగునీరు, అస్తవ్యస్త పరిస్థితులు కనిపించాయని ఇటువంటి పరిస్థితుల వల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, తడి చెత్తను ఒక డబ్బాలో, పొడి చెత్తను మరో డబ్బాలో వేరు చేసి పంచాయతీ చెత్త సేకరణ రిక్షాకు అందించాలని సూచించారు. ప్రతి కుటుంబం చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా సోమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, చెత్త వర్గీకరణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ఇళ్లలో, గ్రామంలో పరిశుభ్రత పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, ప్రజల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుందని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు.

## జగన్ 2.0 సూపర్ యాప్ ఆవిష్కరణకు
# తరలి వెళ్లిన గోకవరం వైసిపి నాయకులు




**గోకవరం,జులై 17 .అక్షర టైమ్స్ :** వైయస్ వైయస్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగన్ 2.0 సూపర్స్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం జగ్గంపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో జగన్ 2.0 సూపర్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోకవరం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శిలు అధిక సంఖ్యలో తరలివెళ్లి యాప్ ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాంజీ, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం సెక్రెటరీ దాసరి చిన్నబాబు, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు కాపు సంఘం అధ్యక్షులు సుంకర వెంకటరమణ, గోకవరం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాటి రాంబాబు, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టి యు సి ఉపాధ్యక్షులు నరాలశెట్టి నరసయ్య, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్టిఐ విభాగం సెక్రెటరీ నున్నం రాంబాబు, కృష్ణుని పాలెం గ్రామ సర్పంచ్ రౌతు జోగేశ్వరరావు, గోకవరం మండలం మహిళా విభాగ అధ్యక్షులు కూరాకుల సుమంగళి, సిహెచ్ వెంకట పద్మరాజు రాజు, రాయి జోగారావు, తుమ్మల రాంబాబు, కసిరెడ్డి రామదుర్గం తదితరులు పాల్గొన్నారు.

## యన్నం బ్రహ్మానంద రెడ్డిని
# పరామర్శించిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**రాచర్ల,జులై 18 .అక్షర టైమ్స్ :** మార్కాపురం జిల్లా రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన యన్నం బ్రహ్మానంద రెడ్డిని వైసీపీ నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రులలో ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న యన్నం బ్రహ్మానంద రెడ్డిని వారి కుటుంబ సభ్యులను ప్రవీణ్ కుమార్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## రాచర్ల కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా
# తనిఖీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి




**రాచెర్ల,జులై 18 .అక్షర టైమ్స్ :** గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి రాచర్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి, భోజన సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, భోజనం నాణ్యత, పరిమాణం, మెనూ అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈరోజు మెనూ ప్రకారం పాయసం అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థినులకు అందించకపోవడంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, తగిన పరిమాణంలో భోజనం అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, స్నానాల గదులను పరిశీలించిన ఎమ్మెల్యే వాటి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదుల్లో సరిపడా వెలుతురు లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే, అవసరమైన చోట అదనపు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే పనిచేయని ఫ్యాన్లను వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థినులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థినుల హాజరును తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై విద్యాబోధన నాణ్యత, విద్యార్థినుల సంక్షేమం, పాఠశాల పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, నల్లబోతుల శ్రీను, సంజీవ్ , నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పశ్చిమ రహదారుల్లో రద్దీ కష్టాలకు చెక్.!

**ఐఐటీ,ఖాజాగూడ కూడళ్ల పనులను సమీక్షించిన నగరపాలక సంస్థ కమిషనర్**

**రూ. 679 కోట్లతో ఫ్లైఓవర్లు, భూగర్భ మార్గాల నిర్మాణం**

**2027 మే నాటికి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు**

**శేర్లింగంపల్లి,జులై 18 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో వాహనాల రద్దీని శాశ్వతంగా దూరం చేసేందుకు సైబరాబాద్ నగరపాలక సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులు వేగంగా దూసుకుపోతున్నాయి. ఐఐఐటీ కూడలి, ఖాజాగూడ కూడళ్ల వద్ద నిర్మిస్తున్న బహుస్థాయి రహదారుల విభజన ప్రాజెక్టుల పురోగతిని నగరపాలక సంస్థ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

**ఐఐఐటీ కూడలి వద్ద రూ. 459 కోట్లతో బహుస్థాయి వంతెనలు**

గచ్చిబౌలి, లింగంపల్లి, విప్రో కూడలి, కొండాపూర్ రహదారులను కలిపే కీలకమైన ఐఐఐటీ కూడలి వద్ద రూ. 459 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 3.39 కిలోమీటర్ల పొడవున బహుస్థాయి వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనిని మే 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ప్రాజెక్టు ప్రత్యేకతలు ఇవే:**

ఐఎస్బీ రహదారి నుండి డిఎల్ఎఫ్ వైపు: 720 మీటర్ల పొడవుతో 4 వరుసల ద్విమార్గ వంతెన (ఇరువైపులా ప్రయాణించేందుకు). డిఎల్ఎఫ్ రహదారి నుండి లింగంపల్లి వైపు: 948 మీటర్ల పొడవుతో 3 వరుసల ఏకమార్గ వంతెన. ఐఎస్బీ రహదారి నుండి గచ్చిబౌలి వైపు: 1.20 కిలోమీటర్ల పొడవుతో 3 వరుసల ఏకమార్గ వంతెన. గచ్చిబౌలి నుండి లింగంపల్లి వైపు: 520 మీటర్ల పొడవుతో 6 వరుసల ద్విమార్గ భూగర్భ మార్గం (అండర్‌పాస్). ప్రస్తుత పురోగతి: నాలుగు వైపులా పునాదులు, పిల్లర్లు, పిల్లర్ల పైభాగాల నిర్మాణం మరియు కాంక్రీట్ దిమ్మెల తయారీ పనులు సమాంతరంగా వేగంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆర్థిక మండలి (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్), వెలుపలి చుట్టుకొలత రహదారి (ఓఆర్ఆర్) వైపు వెళ్లే వారికి రద్దీ కష్టాలు తీరనున్నాయి.

**ఖాజాగూడ కూడలి వద్ద రూ. 220 కోట్లతో వంతెన, భూగర్భ మార్గం**

మెహదీపట్నం, షేక్‌పేట్, నానక్రామ్‌గూడ, గచ్చిబౌలి పరిసర ప్రాంతాల మధ్య వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు ఖాజాగూడ కూడలి వద్ద రూ. 220 కోట్ల వ్యయంతో 1.625 కిలోమీటర్ల పొడవు గల ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. దీనిని ఏప్రిల్ 2027 నాటికి పూర్తి చేయనున్నారు. నానక్రామ్‌గూడ నుండి షేక్‌పేట్ వైపు: 1,085 మీటర్ల పొడవుతో 3 వరుసల ఏకమార్గ వంతెన. షేక్‌పేట్ నుండి గచ్చిబౌలి వైపు: 540 మీటర్ల పొడవుతో 3 వరుసల ఏకమార్గ భూగర్భ మార్గం. ప్రస్తుత పురోగతి: ప్రస్తుతం ఇక్కడ పునాదులు, పిల్లర్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గడువులోగా పూర్తి చేయాలి: కమిషనర్ ఆదేశం పనుల పురోగతిపై సమీక్ష జరిపిన కమిషనర్.. నిర్మాణ రంగంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు, కార్మికుల భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఐటీ కారిడార్‌లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ రెండు బృహత్తర ప్రాజెక్టులు పూర్తయితే పశ్చిమ హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని, ప్రయాణ సమయం భారీగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సమీకృత ఘన వ్యర్థాలు నిర్వహణ కేంద్రం

**చంద్రబాబు వర్చువల్ విధానంలో లాంచనంగా ప్రారంభించిన వరుపుల సత్య ప్రభ రాజా**




**ఏలేశ్వరంజులై 17 .అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మున్సిపాలిటీలో సమీకృత ఘన వ్యర్థాలు నిర్వహణ కేంద్రాని ముఖ్య మంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించగా స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఏలేశ్వరం మున్సిపాలిటీలో 1 కోటి 52 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన తడి వ్యర్థాల నుండి కంపోస్ట్ తయారీ,పొడి వ్యర్థాల నిర్వహణ కేంద్రాని ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబ్జి లాంఛనంగా ప్రారంభించారు. గుడివాడ నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్రలో భాగంగా 10 మున్సిపాలిటీలలో ప్రారంభంలో భాగంగా ఏలేశ్వరం మున్సిపాలిటీ లో నూతనంగా నిర్మించిన సమీకృత ఘన వర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మాట్లాడుతూ.**

పట్టణాలు లో పారిశుధ్యం పై ప్రత్యేక ప్రణాళికలు చేపడుతూ తడి పొడి వ్యర్థాలను వేరు చేస్తూ వాటి నుండి సంపద తయారీ విధానం గా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సత్యప్రభ తెలిపారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఆమె అన్నారు. గ్రామాల పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ బొద్దిరెడ్డి గోపి, పట్టణ టిడిపి అధ్యక్షులు మూది నారాయణస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ అలమండ చలమయ్య, ఏలేశ్వరం మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్, రుచి రమేష్, ఎండగుడి నాగబాబు, పెంద్ర శ్రీను, రాయుడు చిన్న, జొన్నాడ వీరబాబు, సామంతుల గోపి, కోట్ల కృష్ణ, కర్రోతు గాంధీ, చిక్కాల లక్ష్మణరావు, పసల సూరిబాబు, బస్సా ప్రసాద్, మైరాల కనకారావు, జగటాపు సూరిబాబు,

# మానసిక ఆరోగ్యం మహిళా, బాలల రక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమం

**కుక్కునూరులో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చట్టాలు, హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన**




**కుక్కునూరు,జులై 18 .అక్షర టైమ్స్ :** మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో కుక్కునూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మానసిక ఆరోగ్య పరిరక్షణ, ఆత్మహత్యల నివారణ, మహిళలు-- బాలల రక్షణకు సంబంధించిన వివిధ చట్టాలు, ప్రభుత్వ సేవలపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ, మానసిక ఆరోగ్య పరిరక్షణ, వన్ స్టాప్ సెంటర్ (ఒకే చోట సమగ్ర సహాయ కేంద్రం) సేవలు, వివాహానికి ముందు కౌన్సెలింగ్, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం--2013, గృహ హింస నిరోధక చట్టం, బాల్య వివాహాల నివారణ, గ్రామ స్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీల పాత్ర, పోక్సో చట్టం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్, నోడల్ అధికారి ఈ. తులసి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమని అన్నారు. మానసిక సమస్యలు లేదా ఆత్మహత్య ఆలోచనలు వచ్చినప్పుడు వెంటనే టెలి-మానస్ హెల్ప్‌లైన్ 14416, మహిళల సహాయం కోసం 181, పిల్లల రక్షణ కోసం 1098, అత్యవసర పరిస్థితుల్లో 112 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళలు, బాలికల సంక్షేమం కోసం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుక్కునూరు సీడీపీఓ అనంత లక్ష్మి మాట్లాడుతూ వన్ స్టాప్ సెంటర్ ద్వారా హింసకు గురైన మహిళలకు వైద్య, పోలీసు, న్యాయ సహాయం, మానసిక పరామర్శ, తాత్కాలిక ఆశ్రయం వంటి సమగ్ర సేవలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వివాహానికి ముందు యువతకు కుటుంబ విలువలు, పరస్పర అవగాహన, బాధ్యతలు, ఆరోగ్య అంశాలపై ప్రీ-మ్యారిటల్ కౌన్సెలింగ్ అందిస్తున్నామని చెప్పారు. గృహ హింస నిరోధక చట్టం, మహిళలపై పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం--2013 నిబంధనలను కూడా వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) సిబ్బంది పి. రాజేష్, వై. రాజ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమని తెలిపారు. గ్రామ స్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీల బాధ్యతలు, పోక్సో చట్టం, పిల్లల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మహిళలు, బాలికలు, పిల్లల భద్రతతో పాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# చాట్ల వాసు మృతి పట్ల ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి విచారం

**వైసిపి నేతలు టిడిపి కార్యకర్తలపై దాడులపట్ల స్పందించిన ఎమ్మెల్యే**

**అమాయకుల జోలికొస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక**




**కావలి,జులై 18 .అక్షర టైమ్స్ :** కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయతీ తాగేటివారి పాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త చాట్ల వాసుపై ఇటీవల వైసిపి మూకలు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం నెల్లూరు హాస్పిటల్ నందు మృతి చెందారు. సమాచారం అందుకున్న కావలి శాసన సభ్యులు కావ్య కృష్ణారెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఇటీవల పథకం ప్రకారం వాసుపై నిందితులు వైసిపి మూకలు విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన విషయంపై ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేస్తూ, ఘాటుగా స్పందించారు. ఇటీవల వైసిపి నేతలు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై చేస్తున్న దాడులు సహించరానివన్నారు. రూరల్ మండలం చెన్నయపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ అరగల కిష్టయ్య పై గత నెల 8వ తరికున అతి దారుణంగా మారణాయుధాలతో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరులు దాడికి పాల్పడిన విషయం గుర్తు చేశారు. ఈ వైసిపి మూకలు చేస్తున్న దాడుల ను సహించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు అన్నారు. చాట్ల వాసు పైన జరిగిన దాడి సంఘటనలో ప్రధాన నిందితుడు, సూత్రధారి సర్వాయపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్, వైసిపి నాయకుడు మంద మధు అని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఉండటం విచారకరం అన్నారు. ప్రధాన నిదితుడు మధు , మరో ఇద్దరు నిందితులలో రవిచంద్ర అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్ కి పంపినట్లు తెలిపారు. తప్పు చేసిన వారిని పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రశాంతంగా ఉన్న కావలిని రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అనుచరులు ద్వారా అరాచకాలు చేస్తున్నారని గ్రామాల్లో నాయకులు మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని టిడిపి కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. మృతుడు చాట్లా వాసు కు భార్య, చంటి బిడ్డలు ఉన్నారనీ వారు ధైర్యంగా ఉండాలని, వారికి టిడిపి అండగా ఉంటుందని తెలిపారు.

# ఆర్థిక ఒత్తిడి మన జీవితంపై దాని ప్రభావం

**జులై 18 .అక్షర టైమ్స్ :** నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి కుటుంబం ఏదో ఒక దశలో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ధరలు, స్థిరంగా లేని ఆదాయం, అప్పుల భారం, విద్యా మరియు వైద్య ఖర్చులు, ఉద్యోగ అనిశ్చితి వంటి అంశాలు వ్యక్తుల్లో భవిష్యత్తుపై ఆందోళనను పెంచుతున్నాయి. ఈ పరిస్థితి కేవలం డబ్బుకు మాత్రమే సంబంధించినది కాదు; ఇది వ్యక్తి ఆలోచనా విధానం, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు మరియు జీవన నాణ్యతపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతుంది.

### ఆర్థిక ఒత్తిడి అంటే ఏమిటి?

వ్యక్తి తన ఆర్థిక బాధ్యతలను సకాలంలో నెరవేర్చలేననే భావన లేదా రాబోయే రోజుల్లో ఖర్చులను నిర్వహించగలమా అనే అనిశ్చితి వల్ల కలిగే మానసిక ఆందోళనను ఆర్థిక ఒత్తిడి అంటారు. ఇది తాత్కాలిక సమస్యగా ప్రారంభమైనా, సరైన ప్రణాళిక లేకపోతే దీర్ఘకాలికంగా మారే అవకాశం ఉంది.

### మానసిక ప్రశాంతతపై ప్రభావం

ఆర్థిక సమస్యలు ఎక్కువకాలం కొనసాగినప్పుడు మనసులో ఆందోళన, నిరాశ, అసహనం, భయం వంటి భావాలు పెరుగుతాయి. ఏ పని చేసినా దానిపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించలేకపోవడం, భవిష్యత్తు గురించి నిరంతరం ఆలోచించడం, నిద్ర సరిగా లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. దీర్ఘకాలంలో ఇవి తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు.

### శారీరక ఆరోగ్యంపై ప్రభావం

మానసిక ఒత్తిడి శరీరంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. తరచుగా అలసట, తలనొప్పి, జీర్ణ సంబంధ సమస్యలు, రక్తపోటు పెరగడం, గుండె సంబంధిత ఇబ్బందులు వంటి ఆరోగ్య సమస్యలు కనిపించవచ్చు. శరీరం విశ్రాంతి పొందకపోవడం వల్ల రోగనిరోధక శక్తి కూడా తగ్గే అవకాశం ఉంది.

### కుటుంబ జీవితంలో మార్పులు

ఆర్థిక సమస్యలు కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలకు కారణమవుతాయి. ఖర్చులు, అప్పులు లేదా భవిష్యత్తు ప్రణాళికల విషయంలో విభేదాలు ఏర్పడవచ్చు. పిల్లల అవసరాలను తీర్చలేకపోతున్నామనే బాధ తల్లిదండ్రుల్లో ఒత్తిడిని మరింత పెంచుతుంది. ఫలితంగా కుటుంబంలో సానుకూల వాతావరణం దెబ్బతినే ప్రమాదం ఉంది.

### ఉద్యోగం మరియు విద్యపై ప్రభావం

ఆర్థిక ఆందోళనతో ఉన్న ఉద్యోగులు పనిపై పూర్తి దృష్టి పెట్టలేకపోవచ్చు. పనితీరు తగ్గడంతో పాటు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కూడా ప్రభావితమవుతుంది. విద్యార్థుల విషయంలో ఫీజులు, చదువు ఖర్చులు లేదా కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ఉన్న ఆందోళన చదువులో ఏకాగ్రతను తగ్గించవచ్చు.

### నిర్ణయాల నాణ్యతపై ప్రభావం

ఆర్థిక ఒత్తిడి సమయంలో వ్యక్తులు దీర్ఘకాల ప్రయోజనాల కంటే తక్షణ సమస్యల పరిష్కారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఫలితంగా సరైన ఆలోచన లేకుండా అప్పులు చేయడం, అనవసర ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం లేదా మంచి అవకాశాలను కోల్పోవడం జరుగుతుంది.

### సామాజిక సంబంధాలపై ప్రభావం

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పుడు కొంతమంది ఇతరులను కలవడానికి లేదా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెనుకడుగు వేస్తారు. ఈ పరిస్థితి ఒంటరితనాన్ని పెంచి, మానసిక ఒత్తిడిని మరింత తీవ్రతరం చేస్తుంది.

### ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగపడే మార్గాలు

ప్రతి నెల ఆదాయం--ఖర్చులకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అవసరమైన ఖర్చులకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి.

క్రమం తప్పకుండా పొదుపు చేసే అలవాటు పెంచుకోవాలి. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అప్పులను ప్రణాళికాబద్ధంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. కుటుంబ సభ్యులతో ఆర్థిక విషయాలపై పారదర్శకంగా చర్చించాలి.

ఒత్తిడిని తగ్గించే వ్యాయామం, యోగా, ధ్యానం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలి. అవసరమైతే ఆర్థిక నిపుణులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోవాలి.

### ముగింపు

ఆర్థిక ఒత్తిడి అనేది జీవితంలోని అనేక కోణాలను ప్రభావితం చేసే బహుముఖ సమస్య. ఇది వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, ఉద్యోగం, విద్య మరియు సామాజిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే సమయానుకూలమైన ఆర్థిక ప్రణాళిక, బాధ్యతాయుతమైన ఖర్చు విధానం, పొదుపు అలవాటు మరియు సానుకూల దృక్పథంతో ఈ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. ఆర్థిక స్థిరత్వంతో పాటు మానసిక సమతుల్యతను కాపాడుకోవడం ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితానికి బలమైన పునాది అవుతుంది.



# నన్ను అడ్డుకుంటే ఆమరణ దీక్షకు దిగుతా: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

### కాసేపట్లో బీఆర్ఎస్ పార్టీ యువ సంగ్రామ సదస్సు

### సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హౌస్ అరెస్ట్

### హైకోర్టు అనుమతులు ఉన్నా అడ్డుకుంటున్నారని ప్రవీణ్ కుమార్ మండిపాటు



తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలపై, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలతపై గళమెత్తేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'యువ సంగ్రామ సదస్సు' తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. సరూర్ నగర్ స్టేడియంలో మరికాసేపట్లో ప్రారంభం కానున్న ఈ సదస్సుపై ప్రభుత్వం తొలుత ఆంక్షలు విధించింది. దీంతో, బీఆర్ఎస్ ఏకంగా హైకోర్టు మెట్లెక్కి మరీ న్యాయబద్ధంగా అనుమతి తెచ్చుకుంది. అయితే సభ ప్రారంభానికి ముందే పోలీసులు చర్యలు చేపట్టారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను పోలీసులు వారి ఇళ్లలోనే హౌస్ అరెస్టు చేశారు. ఈ నిర్బంధంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ తన నివాసం నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇవాళ ఉదయాన్నే పోలీసులు తనను అరెస్టు చేయడానికి ఇంటికి వచ్చారని ఆయన మండిపడ్డారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న యువ సంగ్రామ సదస్సుకు తాను వెళ్లాల్సి ఉందని, దానికి హైకోర్టు అనుమతి కూడా ఉందని చెప్పినా పోలీసులు వినలేదన్నారు. తమకు పైనుంచి ఆదేశాలు ఉన్నాయని, మిమ్మల్ని ఎక్కడికీ పోనివ్వద్దని పోలీసులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం పర్మిషన్ ఇచ్చినా కూడా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఈ నిర్బంధకాండ నాడు ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని ప్రవీణ్ కుమార్ దుయ్యబట్టారు. ఒకవైపు ఇలాంటి అరాచకాలకు పాల్పడుతూనే, మరోవైపు సిగ్గు లేకుండా ప్రజా పాలన అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే హోంశాఖను పెట్టుకుని, మొదటి నుంచీ బీఆర్ఎస్ సభలకు ఆటంకాలు సృష్టిస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎలాంటి కుట్రలు చేసినా తాను పోలీసుల ఆంక్షలు దాటుకుని సదస్సుకు వెళ్లి తీరుతానని స్పష్టం చేశారు. ఒకవేళ తనను ఇంటి నుంచి కదలనివ్వకుండా బలవంతంగా అడ్డుకుంటే అక్కడికక్కడే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

# రావణ్ కేసు అప్డేట్స్ - ఆర్థిక లావాదేవీలపై ఇంద్రసేన, గమన మౌనం

### రావణ్ కేసులో గమన, ఇంద్రాసేనాను విచారించిన పోలీసులు

### రావణ్, ఇంద్రసేనా, గమనల మధ్య ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నలు

### వ్యక్తిగత అంశాలపైనా విచారించిన పోలీసులు

### వాస్తవాలు కాకుండా తప్పుదారి పట్టించేలా సమాధానాలు



రావణ్ కేసు దర్యాప్తును పోలీసులు మరింత వేగవంతం చేశారు. ఈ కేసులో కీలకంగా భావిస్తున్న గమన, ఇంద్రసేనా చౌదరిని రెండో విడత విచారణకు హాజరుపరిచి ఆర్థిక, వ్యక్తిగత వ్యవహారాలతో పాటు యూట్యూబ్ ఛానళ్ల నిర్వహణ, నిధుల సమీకరణ, విద్వేషపూరిత కంటెంట్ ప్రచారం వంటి అంశాలపై విస్తృతంగా ప్రశ్నించినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 8.30 గంటల వరకు పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు అధికారి ధర్మేంద్ర ఆధ్వర్యంలో విచారణ కొనసాగింది. పలువురు అధికారులు విడివిడిగా ప్రశ్నలు సంధించినప్పటికీ, కీలక ప్రశ్నలకు ఇద్దరూ మౌనంతో పాటు స్పష్టతలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థులపై విద్వేషపూరిత ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబ్ ఛానళ్లకు నిధులు ఎలా సమకూరాయనే కోణంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే గమన, ఇంద్రసేనా చౌదరి బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లను సేకరించిన దర్యాప్తు బృందం, వాటిలోని ప్రతి ఆర్థిక లావాదేవీపై వివరణ కోరినట్లు సమాచారం. అయితే చాలా లావాదేవీలకు సంబంధించి తమకు గుర్తులేదని వారు సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. రావణ్‌తో పరిచయం ఎప్పటి నుంచి ఉందని ప్రశ్నించగా రెండేళ్లుగా పరిచయం ఉందని చెప్పినట్లు సమాచారం. యూట్యూబ్ ఛానళ్ల నిర్వహణకు ఇప్పటివరకు ఎంత మొత్తం ఖర్చు చేశారు, ఆదాయ వనరులు ఏమిటి, నగదు బదిలీలు ఎలా జరిగాయి వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని తెలుస్తోంది. అలాగే ఛానళ్లలో కంటెంట్ ఎంపిక, స్క్రిప్ట్ తయారీ, వీడియోల రూపకల్పనలో ఎవరి పాత్ర ఎంత వరకు ఉందనే అంశాలపైనా అధికారులు ఆరా తీశారు. ఇప్పటివరకు ఎన్ని వీడియోలు అప్‌లోడ్ చేశారన్న ప్రశ్నకు కూడా ఖచ్చితమైన వివరాలు చెప్పలేదని సమాచారం. రావణ్ రూపొందించిన వీడియోల సంఖ్యపై కూడా స్పష్టత ఇవ్వలేదని తెలిసింది. విచారణ మధ్యలో గమన, ఇంద్రసేనా చౌదరిని పోలీసులు మంగళగిరిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న వారి మొబైల్ ఫోన్లను సాంకేతిక విశ్లేషణ కోసం ఇప్పటికే ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ఫోన్లను అన్‌లాక్ చేయించి అందులోని సమాచారాన్ని పరిశీలించే ప్రక్రియ చేపట్టారు. ఒకవేళ ఫోన్లలోని డేటాను తొలగించి ఉంటే, దానిని సాంకేతికంగా తిరిగి రాబట్టే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. అనంతరం గమనను తిరిగి పెనమలూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా, ఇంద్రసేనా చౌదరిని గన్నవరం తరలించి అక్కడ ప్రత్యేకంగా ప్రశ్నించినట్లు తెలిసింది. కీలక అంశాలపై స్పష్టమైన సమాధానాలు లభించకపోవడంతో ఇద్దరికీ మరోసారి నేడు విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ఫోరెన్సిక్ నివేదికలు, బ్యాంకు లావాదేవీల విశ్లేషణ ఆధారంగా దర్యాప్తు మరింత ముందుకు సాగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

# ఆశ్రమంలో గంజాయి సాగు.. ములుగు జిల్లాలో సాధువు అరెస్ట్

### ములుగు జిల్లా ఆశ్రమంలో గంజాయి సాగు గుట్టురట్టు

### ఆధ్యాత్మిక కార్యక్రమాల ముసుగులో అక్రమ పెంపకం

### కాశీకి చెందిన సాధువు శ్రీరామ్ గిరిని అరెస్ట్ చేసిన పోలీసులు

### ఆశ్రమం నుంచి 36 గంజాయి మొక్కల స్వాధీనం



ఆధ్యాత్మిక కేంద్రం ముసుగులో గంజాయి సాగు చేస్తున్న ఒక సాధువును తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ములుగు జిల్లా తాండూరు మండలంలోని ఒక ఆశ్రమంలో ఈ ఘటన వెలుగుచూసింది. కాశీకి చెందిన శ్రీరామ్ గిరి అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గోవిందరావుపేటలోని ఆశ్రమంపై మెరుపు దాడి చేశారు. ఆశ్రమ ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా, అక్రమంగా సాగు చేస్తున్న 36 గంజాయి మొక్కలు బయటపడ్డాయి. వాటిని వేర్ల సహా స్వాధీనం చేసుకున్న పోలీసులు, అక్కడే లభించిన కొంత ఎండిన గంజాయిని కూడా సీజ్ చేశారు. నమూనాలను తదుపరి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. నిందితుడైన శ్రీరామ్ గిరి తన సోదరితో కలిసి ఈ ఆశ్రమంలో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరుతో స్థానికులను నమ్మిస్తూ, చాటుగా గంజాయి సాగు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేసినట్లు అధికారులు వివరించారు. పవిత్రమైన ఆశ్రమంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు సాగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

## దాడికి గుర్రై చికిత్స పొందుతూ చాట్ల వాసు మృతి

### తాగేటిపాలెంలో విషాద ఛాయలు







**కావలి,జులై 18 .అక్షర టైమ్స్ :** ఇటీవల పథకం ప్రకారం దాడికి పాల్పడి అతి కిరాతకంగా గాయపరచబడి నెల్లూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చాట్ల వాసు శనివారం మృత్యు వాత పడ్డాడు. కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయతీ తాగేటివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాట్ల వాసు దారుణహత్యకు గురయ్యాడు. ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కి ముఖ్య అనుచరుడు మంద మధు అని విమర్శలు వినిపిస్తున్నాయి. పరారీలో వైసీపీ నేత మాజీ సర్పంచ్ మంద మధు, మరో ఇద్దరు నిందితులు ఉన్నట్లు సమాచారం, రవిచంద్ర అనే నిందితుడిని కావలి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్ కి పంపినట్లూ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మర చేసి, దర్యాప్తు చేపట్టినట్లూ రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వాసు ను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ కి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహా న్ని స్వగ్రామం తాగేటివారిపాలెం గ్రామానికి తరలించారు. ఈ ఉదంతం తో తాగేటివారిపాలెంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడు వాసు కు భార్య, చంటి బిడ్డ కూడా ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో వారు విషదవదనంతో ఉండిపోయారు. అందుబాటులో లేకపోయినందున సమాచారం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ తీగలు తగిలి గిరిజన కూలీ మృతి ఊచపల్లిలో విషాద ఘటన



**పొదలకూరు,జులై 18 .అక్షర టైమ్స్ : (రిపోర్టర్ ఆనంద్)** పొదలకూరు మండలం ఊచపల్లి గ్రామంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. పొరపాటున విద్యుత్ తీగలు తగిలి, పొదలకూరు పట్టణంలోని శ్రామిక నగర్‌కు చెందిన గిరిజనుడు శ్రీనివాసులు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు, శ్రీనివాసులు సుమారు రెండు నెలల క్రితం ఊచపల్లి గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో కాపలాదారుడిగా చేరి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న కండలేరు డ్యామ్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆంధ్రా హాస్పిటల్స్, మహేష్ బాబు ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**నరసరావుపేటజులై 18 .అక్షర టైమ్స్ :** స్థానిక పల్నాడు రోడ్ లో గల శ్రీత్రికోటేశ్వర స్కాన్ సెంటర్ నందు ముందుగా ప్రకటించిన విధంగా మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ లింగస్వామి పర్యవేక్షణలో విజయ వంతం అయింది. సమయం తక్కువగా ఉన్నప్పటికీ సుమారు 20 మంది చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించమని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగస్వామి మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు చిన్న పిల్లల తల్లి తండ్రులు ఎవరు డబ్బుల గురించి ఆలోచించకుండా వారి పిల్లలను ఇలా వైద్యశిబిరం ఏర్పాటు చేసినప్పుడు తీసుకొని వస్తే వాళ్లను పరీక్షించి అవసరమైన వారికి హీరోమహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా పల్నాడుజిల్లా నరసారావుపేట టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు మహ్మద్ ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో డాక్టర్ లింగస్వామి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు అభిమానులు నబీబాజీ, చిన్ని కృష్ణ, అబ్దుల్ సలామ్, నాగేశ్వరరావు, షశీషిర్అలీ, థామస్, కోటేశ్వరరావు, షణ్ముఖసాయి, సుభాని, మీరావలి మరియు ఆంధ్రా హాస్పిటల్స్ పి ఆర్ ఓ అజయ్ మరియు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఘట్టమనేని జయకృష్ణ జన్మదినవేడుకలు



**నరసరావుపేట,జులై 18 .అక్షర టైమ్స్ :** స్థానిక లూథరన్ అంధుల పాఠశాలలో సూపర్ స్టార్ కృష్ణ మనవడు హీరో రమేష్ బాబు కుమారుడు అయిన ఘట్టమనేని జయకృష్ణ జన్మదిన వేడుకలు శనివారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు మహ్మద్ ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో ఘట్టమనేని జయకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అంధుల పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు కేక్ ముక్కలతో పాటుగా బిస్కెట్ ప్యాకెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మహ్మద్ ఫారూఖ్ బాబు మాట్లాడుతూ హీరో జయకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఇలా పాఠశాల విద్యార్థిని, విద్యార్థుల మధ్య జరుపుకోవటం చాల ఆనందంగా ఉందని తెలియజేశారు. అలాగే ఈనెల 30వ తేదీన ఘట్టమనేని జయకృష్ణ నటించిన మొదటి చిత్రం "శ్రీనివాస మంగాపురం" చిత్రాన్ని ప్రేక్షకులు, సినీ అభిమానులు మరియు సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు అభి మానులు అందరూ ఆదరించి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అభిమానులు నబీ బాజీ, చిన్ని కృష్ణ, అబ్దుల్ సలామ్, నాగేశ్వరరావు, షశీషిర్ఆలీ, థామస్ , కోటేశ్వరరావు, షణ్ముఖసాయి, సుభాని, మీరావలి మరియు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణం, సహజ వనరుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే : హైకోర్టు

### చెరువులో మట్టి తవ్వకాలకు 2022లో విజయనగరం కలెక్టర్ ఇచ్చిన అనుమతులు రద్దు

### సహజ వనరులకు ప్రజల తరపున ప్రభుత్వం ట్రస్టీ (సంరక్షకుడు)గా వ్యవహరించాలని సూచన

పర్యావరణం, సహజ వనరులు దేశ సంపదని వాటిని సంరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వాల పైనే ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. గాలి, నీరు, అడవులు తదితర సహజ వనరులకు ప్రజల తరపున ప్రభుత్వం కేవలం ట్రస్టీ (సంరక్షకుడు)గా మాత్రమే వ్యవహరించాలని న్యాయస్థానం సూచించింది. కాలుష్య రహిత గాలి, నీరు, పర్యావరణంలో జీవించడం అనేది రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ ప్రసాదించిన జీవించే హక్కులో అంతర్భాగమని ఈ సందర్భంగా గుర్తుచేసింది. జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం విజయనగరం జిల్లా బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామంలోని కన్నంనాయుడు చెరువు నుంచి మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వకాలకు అనుమతిస్తూ 2022 ఏప్రిల్‌లో విజయనగరం జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు పూర్తిగా రద్దు చేసింది. సహజ వనరుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది మే 8న ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక నిర్వహణ విధానానికి (ఎస్ఓపీ) కట్టుబడి వ్యవహరించాలని గనులశాఖకు ఆదేశాలిచ్చింది. అంతేకాకుండా, ఈ ఎస్ఓపీ అమలు తీరుపై ఏడాదికోసారి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు ఇటీవల కీలక తీర్పు ఇచ్చారు. వెంటనే మేల్కొనకపోతే భావితరాలకు ప్రమాదం: కన్నంనాయుడు చెరువు నుంచి ఇష్టారాజ్యంగా మట్టి, ఇసుక తవ్వకాలకు కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ కొత్తపాలెం గ్రామానికి చెందిన బొడ్డు సత్యవతితో పాటు మరికొందరు స్థానిక రైతులు హైకోర్టులో పిల్/వ్యాజ్యం వేశారు. దాదాపు 2 వేల ఎకరాల ఆయకట్టు సాగునీటికి కేవలం ఈ చెరువే ఏకైక ఆధారమని వారు ధర్మాసనానికి వివరించారు. ఈ వ్యాజ్యంపై సుదీర్ఘ విచారణ జరిపిన న్యాయమూర్తి కలెక్టర్ ఇచ్చిన పాత ప్రొసీడింగ్స్ మైన్స్ అండ్ మినరల్ చట్ట నిబంధనలకు పూర్తిగా విరుద్ధమంటూ వాటిని కొట్టివేశారు.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.9100900931

# కాళ్ల వాపులా? ఒత్తిడి వేధిస్తోందా?

**10 నిమిషాల ఈ ఒక్క ఆసనంతో అద్భుత ఉపశమనం!**

**కాళ్ల వాపులు, ఒత్తిడి తగ్గించే 'విపరీత కరణి' ఆసనంపై పెరుగుతున్న ఆసక్తి**

**కేవలం 10 నిమిషాల్లోనే రక్త ప్రసరణ మెరుగుపరిచి ఉపశమనం**

**గంటల తరబడి కూర్చుని, నిల్చుని పనిచేసేవారికి ఇది ఎంతో మేలు**

**గుండె జబ్బులు, హై బీపీ ఉన్నవారు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**



ఆధునిక జీవనశైలిలో గంటల తరబడి కూర్చోవడం, నిలబడటం సర్వసాధారణమైపోయింది. దీనివల్ల చాలామంది కాళ్ల వాపులు, అలసట, మానసిక ఒత్తిడి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి కేవలం 10 నిమిషాల్లోనే అద్భుతమైన ఉపశమనాన్ని అందించే ఒక సులభమైన యోగాసనం ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందుతోంది. అదే 'విపరీత కరణి' లేదా 'లెగ్స్-అప్-ది-వాల్' ఆసనం. ఎలాంటి ఖరీదైన పరికరాలు లేకుండా ఇంట్లోనే గోడ సహాయంతో ఈ ఆసనాన్ని సులభంగా వేయవచ్చు.ఈ ఆసనం వేయడానికి, నేలపై వెల్లకిలా పడుకుని, కాళ్లను నిటారుగా పైకి చాచి గోడకు ఆనించాలి. ఇలా చేయడం వల్ల గురుత్వాకర్షణ శక్తి సాయంతో కాళ్లలో పేరుకుపోయిన ద్రవాలు, రక్తం తిరిగి గుండె వైపు ప్రసరిస్తాయి. ఫలితంగా కాళ్ల వాపులు, బరువుగా అనిపించడం వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఈ భంగిమ మెదడుకు విశ్రాంతి సంకేతాలను పంపి, నాడీ వ్యవస్థను శాంతపరుస్తుంది. దీనివల్ల శరీరం 'ఫైట్-ఆర్-ఫ్లైట్' (ఒత్తిడి) మోడ్ నుంచి 'రెస్ట్ అండ్ డైజెస్ట్' (విశ్రాంతి) మోడ్‌లోకి మారుతుంది.

### ఎలా పనిచేస్తుంది?.. ప్రయోజనాలేమిటి?

సాధారణంగా ఎక్కువ సేపు కదలకుండా ఉన్నప్పుడు గురుత్వాకర్షణ ప్రభావంతో కాళ్లలో రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. దీంతో పాదాలు, చీలమండలాల్లో ద్రవాలు చేరి వాపు వస్తుంది. వేడి, ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, గర్భం, సిరల బలహీనత వంటి కారణాలు ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తాయి. కాళ్లను గుండె కంటే పైకి ఎత్తడం వల్ల ఈ ప్రక్రియ రివర్స్ అవుతుంది. రక్త, లింఫాటిక్ ప్రసరణ మెరుగుపడుతుంది."గంటల తరబడి నిలబడటం, కూర్చోవడం లేదా ప్రయాణాలు చేసేవారు తమ కాళ్లను 10 నుంచి 15 నిమిషాల పాటు పైకి లేపడం వల్ల కాళ్ల బరువు, తేలికపాటి వాపు, అలసట నుంచి ఉపశమనం పొందవచ్చు" అని వైద్య నిపుణులు వివరించారు. ఈ ఆసనం వేసేటప్పుడు దీర్ఘంగా శ్వాస తీసుకోవడం వల్ల గుండె వేగం తగ్గి, మానసిక ఆందోళన కూడా దూరమవుతుంది. డెస్క్ జాబ్స్ చేసేవారు, ప్రయాణికులు, వృద్ధులకు ఇది చాలా ప్రయోజనకరం.

### ఎలా వేయాలి?.. ఎవరు జాగ్రత్తగా ఉండాలి?

ఈ ఆసనం వేయడానికి ముందుగా గోడ పక్కన ఒకవైపు తిరిగి కూర్చోవాలి. నెమ్మదిగా వెల్లకిలా పడుకుంటూ, కాళ్లను పైకి చాచి గోడకు ఆనించాలి. పిరుదులకు, గోడకు మధ్య కొద్దిగా ఖాళీ ఉంచుకోవచ్చు. చేతులను శరీరానికి ఇరువైపులా రిలాక్స్‌గా ఉంచి, 5 నుంచి 10 నిమిషాల పాటు దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి.అయితే, ఈ ఆసనం అందరికీ సురక్షితం కాదు. అదుపులో లేని అధిక రక్తపోటు (హై బీపీ), గ్లకోమా (కంటిలోని ఒత్తిడి), తీవ్రమైన గుండె జబ్బులు ఉన్నవారు, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నవారు ఈ ఆసనానికి దూరంగా ఉండాలి లేదా వైద్యుల సలహా తీసుకోవాలి. ఒకవేళ కాళ్ల వాపు అకస్మాత్తుగా వచ్చినా, ఒకే కాలులో నొప్పి, ఎరుపుదనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎందుకంటే అవి డీప్ వీన్ థ్రాంబోసిస్ (రక్తం గడ్డకట్టడం) లేదా ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. ఈ ఆసనం కేవలం ఒక సహాయక పద్ధతి మాత్రమేనని, క్రమం తప్పని వ్యాయామం, సమతుల్య ఆహారం, సరైన వైద్య సంరక్షణకు ప్రత్యామ్నాయం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కఠినమైన ఆహార నియమాలు అవసరం లేదు.. ఈ చిన్న అలవాట్లే ఆరోగ్యానికి అసలైన రహస్యం!

**కఠినమైన డైట్‌లు అవసరం లేదంటున్న నిపుణులు**

**ఆకలికి తగ్గట్టు భోజనం ప్లాన్ చేసుకోవాలని సూచన**

**అల్పాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని హితవు**

**ఇష్టమైన ఆహారం పరిమితంగా తీసుకోవచ్చని వెల్లడి**

**చిన్న అలవాట్లే దీర్ఘకాలంలో పెద్ద ఫలితం ఇస్తాయని వివరణ**

**పోషకాహారం ఆరోగ్యానికి కీలకమన్న డబ్ల్యూహెచ్ఓ**



బరువు తగ్గాలన్నా లేదా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నా చాలామంది ముందుగా డైట్ (ఆహార నియమాల) గురించే ఆలోచిస్తారు. ఇందుకోసం తమకు ఇష్టమైన ఆహార పదార్థాలను పూర్తిగా దూరం పెట్టి, కొన్ని రోజుల పాటు కఠినమైన నియమాలను పాటిస్తుంటారు. అయితే, ఇలాంటి కఠిన నిబంధనలను ఎక్కువ మంది మధ్యలోనే వదిలేస్తుంటారు. నిజానికి ఆరోగ్యంగా ఉండటానికి ఇంత కష్టపడాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజువారీ జీవనశైలిలో చేసుకునే చిన్నపాటి మార్పులే దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయని సూచిస్తున్నారు. అందుకోసం నిపుణులు చెబుతున్న ఐదు సులభమైన చిట్కాలను ఇప్పుడు చూద్దాం..

### ఆకలి సంకేతాలను గుర్తించండి

ముందుగా మన శరీరం ఇచ్చే సంకేతాలను అర్థం చేసుకోవాలి. రోజులో ఏ సమయంలో ఎక్కువగా ఆకలి వేస్తుందో గమనించి, దానికి అనుగుణంగా భోజన సమయాలను ప్లాన్ చేసుకోవాలి. సమయానికి కాకుండా, శరీరం ఇచ్చే ఆకలి సంకేతాలకు ప్రాధాన్యమిస్తే ఆహారపు అలవాట్లు సహజంగా మారుతాయి.

### అల్పాహారం అత్యంత కీలకం

ఆరోగ్య సంరక్షణలో అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) కీలక పాత్ర పోషిస్తుంది. ఇది రోజంతా శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా.. పేగుల ఆరోగ్యం, హార్మోన్ల సమతుల్యత, వ్యాయామ సామర్థ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది. కేవలం వ్యాయామం చేస్తే సరిపోదని, దానికి తగిన పోషక విలువలు కలిగిన ఆహారం కూడా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఇష్టమైనవి మానేయాల్సిన పనిలేదు

ఆరోగ్యంగా ఉండాలంటే ఇష్టమైన ఆహారాన్ని పూర్తిగా వదులుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వాటిని పరిమిత పరిమాణంలో తీసుకుంటూ, మిగిలిన భోజనాన్ని సమతుల్యంగా ఉండేలా చూసుకుంటే సరిపోతుంది. కొన్ని రోజుల పాటు కఠినమైన డైట్ పాటించడం కంటే, నిత్యం ఆచరించగలిగే చిన్నపాటి ఆరోగ్యకరమైన అలవాట్లే మెరుగైన ఫలితాలను ఇస్తాయి. స్థిరంగా కొనసాగించగలిగే మార్పులే ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

### పోషకాహారమే అసలైన బలం

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా పోషకాహార ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. సమతుల ఆహారం రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల ముప్పును తగ్గిస్తుంది. శరీరానికి అవసరమైన పోషకాలు అందినప్పుడు సహజంగానే శక్తి పెరుగుతుంది. ఇది దీర్ఘకాలిక ఆరోగ్యానికి దోహదపడటంతో పాటు పనితీరును మెరుగుపరుస్తుంది. జీవన నాణ్యతను పెంచుతుంది.

# రాముడి వంశీకులమని కొందరు ఎందుకు చెప్పుకుంటున్నారు ?

**చరిత్ర, పురాణాల్లో ఏముంది**







"ఇక్ష్వాకు కుల తిలకా.. ఇకనైన పలుకవే రామచంద్రా.." అంటూ సాగే భక్త రామదాసు కీర్తన తెలుగు వారికి బాగా పరిచితం. రాముణ్ణి తరచుగా ఇక్ష్వాకు వంశీకుడిగా పురాణాల్లో వర్ణిస్తూ ఉంటారు. తాజాగా మరోసారి ఇక్ష్వాకు వంశం పేరు వార్తల్లోకి వచ్చింది."భూమండలం అంతా ఇక్ష్వాకులదా కాదా? ఇక్ష్వాకుల గోత్రం ఏంటి?" అంటూ చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌ను బెదిరిస్తూ 'రామరాజ్యం' సంస్థకు చెందిన వీర రాఘవ రెడ్డి మాట్లాడిన వీడియో ఈ మధ్య వైరల్ అయింది."ఇక్ష్వాకుల గోత్రం కూడా నీకు తెలియదు" అంటూ రంగరాజన్‌ను విమర్శించారు రాఘవ రెడ్డి.ఇంతకీ ఎవరీ ఇక్ష్వాకులు? ఏంటి వారి వంశం? అనేవి అర్థం కావాలంటే మూడు విషయాలు తెలియాలి. ఈ పదం మూడు చోట్ల ప్రముఖంగా వినిపిస్తుంది.హిందూ పురాణాల ప్రకారం రాముడి వంశాన్ని ఇక్ష్వాకు వంశం అంటారు. సూర్యుడి నుంచి ఆ వంశం ఏర్పడింది కాబట్టి సూర్య వంశం అని, రఘు అనే గొప్ప మహారాజు కూడా ఆ వంశీకుడే కాబట్టి రఘువంశం అని కూడా అంటారు.పురాణాల ప్రకారం.. రాముడి వంశంలో మొట్టమొదటి పాలకుడు అంటే అయోధ్య రాజధానిగా కోసల రాజ్యాన్ని పాలించిన వ్యక్తి ఇక్ష్వాకుడు. ఆ ఇక్ష్వాకుడు వైవస్వత మనువు కొడుకు. అలా వారి క్రమంలో 80వ రాజు రాముడు.ముచుకుంద, అంబరీష, భరత, బాహుబలి, హరిశ్చంద్ర, దిలీప, సగర, రఘు, దశరథ...ఇలా వీరంతా రాముడి కంటే ముందు ఇక్ష్వాకు వంశపు రాజులు."శ్రీరాముని వంశ వృక్షాన్ని రఘువంశ మహాకావ్యంలో వర్ణించారు. అది కాళిదాసు రాసిన సంస్కృత మహా కావ్యం. ఇక ఇక్ష్వాకుల వంశ మొదటి రాజుగా ఇక్ష్వాక చక్రవర్తే ఉంటారు. ఇక్ష్వాకు వంశంలో చివరి రాజుగా బృహద్బలుడి పేరు కనిపిస్తుంది. ఆయనే మహాభారతంలో కూడా కనిపిస్తారు. బృహద్బలుడు కౌరవుల తరపున భారత యుద్ధంలో పాల్గొన్నాడు" అని వాస్తు జ్యోతిష్య పండితులు, ఆధ్యాత్మికవేత్త పాలెపు రాజేశ్వర శర్మ బీబీసీతో చెప్పారు.రామాయణంతో పాటు వేదాల్లో కూడా ఇక్ష్వాకు పదం ప్రస్తావన ఉంది. వీటన్నింటిని హిందువుల విశ్వాసాలతో పాటు రామాయణం, భాగవతం, ఇతర పురాణాలు, రఘువంశం కావ్యం పేర్కొన్నాయి.హిందూ గ్రంథాలతో సంబంధం లేకుండా చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే, భారతదేశంలో కొన్ని రాజ కుటుంబాలు ఈ పేరును ఉపయోగించుకున్నాయి.అయోధ్య ప్రాంతాన్ని క్రీస్తు పూర్వం 530 ప్రాంతంలో పాలించిన ప్రసేన్‌జిత్ అనే రాజు ఇక్ష్వాకు వంశీకుడని, అలాగే క్రీస్తు పూర్వం 345 ప్రాంతంలో పాలించిన సుమిత్రుడనే రాజు సూర్య వంశీకుడని చెప్పుకున్నట్టు కొందరు చరిత్రాకారులు రాశారు.అయితే ఈ ఇద్దరూ హిందూ పురాణాల్లోని ఇక్ష్వాకు వంశీకులే అనడానికి స్పష్టమైన ఆధారం లేదు.తెలుగునాట కూడా ఓ రాజ వంశానికి ఈ పేరు ఉంది. కృష్ణా నదీ తీరంలో శాతవాహనుల తరువాత పాలించిన రాజులు ఆంధ్ర ఇక్ష్వాకులు. వీళ్లనే విజయపురి ఇక్ష్వాకులు అని కూడా అంటారు.క్రీస్తు శకం 3-4 శతాబ్దాల్లో వీరు పాలించారని ఎక్కువ మంది చరిత్రకారులు చెప్పారు. ప్రస్తుత పల్నాడు జిల్లా మాచర్ల దగ్గర నాగార్జునకొండ వీరి రాజధాని. ఆంధ్ర, తెలంగాణల్లో పలు ప్రాంతాలను వీరు పాలించారు.రాముడి గురించి చెప్పే ఇక్ష్వాకు వంశానికీ వీరికీ సంబంధం ఉన్నట్టు పురాణపరంగా గానీ, చరిత్రపరంగా గానీ ఆధారాలు లేవు."శాతవాహనుల తరువాత ఆంధ్ర ఇక్ష్వాకులు తెలుగునేలను పాలించారు. హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులు, వీరూ ఒకరని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు" అని చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ బీబీసీతో చెప్పారు."నేటికి 2500 ఏళ్ల క్రితమూ, 1700 సంవత్సరాల కిందటా పాలించిన కొందరు రాజులు తమను తాము ఇక్ష్వాకులు అని చెప్పుకున్నారు. కానీ చరిత్రలోని ఇక్ష్వాకులు, పురాణాల్లోని ఇక్ష్వాకులు ఒకరే అని చెప్పే ఆధారాలు లేవు. అసలు హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులుగా చెబుతున్నవారు నిజంగా చరిత్రలో ఉన్నారా? అనే దానికి సైతం స్పష్టమైన ఆధారాలు లేవు. ఇక ఇన్ని వందల సంవత్సరాల తరువాత ఇక్ష్వాకు వంశం వారు ఇంకా ఉన్నారా అంటే సాక్ష్యాలు, ఆధారాలు ఉండవు" అంటున్నారు చరిత్రకారులు హరగోపాల్.జైన సాహిత్యంలోని స్వయంభూ స్తోత్రంలో 1-3-3 శ్లోకంలో 'భగవంతుడైన రిషభదేవుడు ఇక్ష్వాకు వంశానికి మొదటి రాజు' అని రాశారు. ఆయన్నే ఇక్ష్వాకుడు అని జైనులు పిలుస్తారు.రిషభదేవుడు లేదా రిషభనాథుడు జైనుల్లో మొదటి తీర్థంకరుడు. ఈయన్ను జైన మత స్థాపకుడిగా పరిగణిస్తారు.ఇక బౌద్ధంలో కూడా ఇక్ష్వాకు వర్ణనలు ఉన్నాయి. భారత్‌తో పాటు టిబెట్ బౌద్ధ సంప్రదాయాల్లో ఇక్ష్వాకుకు సమానార్థకమైన పదాలతో రాజ వంశాల వర్ణన బౌద్ధ సాహిత్యంలో కనిపిస్తుంది.

### ఇక్ష్వాకులు ఇప్పుడు ఉన్నారా?

"ఏ కులం వారైనా ఇక్ష్వాకులు అని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు. ఇక్ష్వాకు వంశం ఇప్పటి వరకూ కొనసాగి, ఆ వంశం వారు ఎవరో ఒకరు ఇంకా ఉన్నారనడానికి చెప్పే అవకాశం లేదు. ఎవరైనా చెప్పుకున్నా దానికి సాక్ష్యం ఉండదు. ఈ మధ్య కాలంలో చాలామంది తమ కులం, కుటుంబ గతం ఘనమైనది అని చెప్పుకునే క్రమంలో రాజరికాన్ని ఆపాదించుకుంటున్నారు. వారికి నిజంగా ఘన చరిత్ర ఉందా లేక లేనిదాన్ని ఘనంగా చెప్పుకుంటున్నారా అన్నది చూడాలి" అన్నారు హరగోపాల్."ఒకసారి ఒకరు రాజరికం పొందాక తమను తాము కాని, లేదా వారి ఆస్థానంలోని వారు కాని ఈ రాజులకు దైవత్వం ఆపాదించడం, సూర్య, చంద్ర వంశాల వారంటూ కీర్తించడం భారత చరిత్రలో బాగా కనిపిస్తుంది. దీన్నే శాసనాల్లో, గ్రంథాల్లో రాజ ప్రశస్తి అంటారు" అని శ్రీరామోజు హరగోపాల్ చెప్పారు.

# 'ఉప్పు' తక్కువగా తీసుకుంటున్నారా

**మీ శరీరంలో జరిగే మార్పులివే!**

**ఉప్పు అన్నింటికీ ముప్పే**

**గుండె, కిడ్నీల ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్న నిపుణులు!**



"వంటల్లో అన్నీ వేసి చూడండి, నన్ను వేసి చూడండి" అంటుందట ఉప్పు. వంటల రుచిలో ఉప్పుదే సింహభాగం. కానీ, అది కాస్త తక్కువైతే పర్లేదు కానీ, ఏ మాత్రం ఎక్కువైనా ఆ పదార్థాలు పక్కన పెట్టేయాల్సిందే. ఉప్పు శరీరంలోని ద్రవ స్థాయిలను నియంత్రిస్తుంది. నరాల సంకేతాలను ప్రసారం చేస్తుంది. కండరాల సంకోచం, సడలింపులో సహాయపడుతుంది. రక్తపోటు, ప్లాస్మా పరిమాణాన్ని నిర్వహించడానికి కూడా ఉప్పు చాలా అవసరం. కానీ, ఉప్పు మితిమీరితే మాత్రం ఆరోగ్యానికి ముప్పు తప్పదంటున్నారు నిపుణులు. అందుకే, ఉప్పు తీసుకునే పరిమాణంలో నియంత్రణ కలిగి ఉండాలని చెబుతున్నారు.ఈ క్రమంలో ఉప్పు తక్కువగా తీసుకుంటే మనం ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో? వ్యాధుల ముప్పు ఎలా తగ్గుతుందో? ఇప్పుడు తెలుసుకుందాం!ప్రతి ఒక్కరూ ఉప్పు విషయంలో నియంత్రణ కలిగి ఉండాలి. కానీ, చాలామంది సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువగానే తీసుకుంటున్నారు. ఫలితంగా అనేక రకాల ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో పెద్దలు రోజుకు 2000 మిల్లీగ్రాముల కంటే తక్కువ సోడియం (రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పుతో సమానం) లేదా ఒక టీస్పూన్ కంటే కొంచెం తక్కువ తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) సిఫార్సు చేస్తోంది. ఎందుకంటే, ఉప్పు వినియోగం పెరిగినప్పుడు, అది గుండె, రక్తపోటు, మూత్రపిండాలు, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. అందుకే, ఉప్పు తీసుకోవడం తగ్గించడం చాలా ముఖ్యం.అధిక ఉప్పు వల్ల శరీరం నీటిని నిలుపుకుంటుంది. దీనివల్ల రక్త పరిమాణం పెరిగి గుండెపై అదనపు భారం పడుతుందంటున్నారు నిపుణులు. ఇది రక్తపోటును పెంచి, ధమనులపై ఒత్తిడి కలిగించి హైపర్ టెన్షన్‌కు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఉప్పును తక్కువగా తీసుకోవడం వల్ల రక్త నాళాలు సడలి, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రక్తపోటు స్థిరంగా ఉంటుంది. ఉప్పును కొద్దిగా తగ్గించినా త్వరగా ఫలితాలు కనిపిస్తాయట. తలనొప్పి తగ్గడం, మంచి నిద్ర, మైకం తగ్గడాన్ని మీరు గమనించవచ్చు. దీర్ఘకాలంలో ఇది స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, రక్త నాళాల దెబ్బతినకుండా కాపాడుతుందని ఒఓఅవఅఓవఒఅతీవష్ పేర్కొంది.ఉప్పు ఎక్కువగా తీసుకుంటే, అది రక్త నాళాల పొరలను దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. ఇది ధమనులలో కొవ్వు పేరుకుపోవడానికి దారితీస్తుందని చెబుతున్నారు. దీనివల్ల ధమనులు మూసుకుపోయి గుండెకు ఆక్సిజన్ అందదు. ఇది కాలక్రమేణా గుండె కండరాలను బలహీనపరుస్తుంది. ఈ క్రమంలో తక్కువ ఉప్పు ఉన్న ఆహారం గుండెపై ఒత్తిడిని తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండె లయను స్థిరీకరిస్తుంది. వంటల్లో ఉప్పును తక్కువగా వాడే వారిలో గుండెపోటు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. దీనివల్ల గుండె మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది. హృదయ సంబంధ ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మూత్రపిండాల వ్యాధిని నివారించడానికి, నిర్వహించడానికి కూడా ఉప్పు తగ్గించాలని టతీశీత్‌అవతీంఅఅ పేర్కొంది.ఉప్పు ఎక్కువైతే శరీరంలో ద్రవాలు పేరుకుపోవడం, వాపులు రావడం, మూత్రం ద్వారా ప్రోటీన్ బయటకు పోవడం వంటివి జరుగుతాయి. దీర్ఘకాలికంగా ఉప్పును అధికంగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఉప్పు తగ్గించడం వల్ల ఈ భారం తగ్గుతుందని చెబుతున్నారు.అధిక ఉప్పు హైడ్రేషన్‌కు అంతరాయం కలిగిస్తుంది. దీనివల్ల ముఖం ఉబ్బడం, దాహం, నీటి నిలుపుదల వల్ల అలసట కలుగుతుందంటున్నారు నిపుణులు. మీరు తగినంత నీరు తాగినప్పటికీ, కణాలు వాపునకు గురై డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు. ఉప్పు తగ్గించడం వల్ల ఈ సమతుల్యతను తగ్గిపోతుందని తెలియజేస్తున్నారు. ముఖం, అవయవాల వాపు తగ్గుతుందట. శక్తి స్థాయిలు పెరగడంతో పాటు చర్మం మెరుస్తూ, మైగ్రేన్ వంటి సమస్యలు తగ్గుతాయి.ఉప్పు తగ్గించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. ఇది కడుపు అల్సర్లు లేదా కాలేయ ఒత్తిడి వంటి సమస్యలకు కారణమయ్యే శరీర వాపులను తగ్గిస్తుందని చెబుతున్నారు. రక్తపోటు మందులు వంటి ఔషధాల పనితీరును ఇది మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మానసిక పరంగా చూస్తే, మెదడుకు స్థిరమైన రక్త ప్రసరణ జరగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

# మొక్కలు, పూలు, కుండీల మాటున వచ్చే జంతువులతో ఎంత ప్రమాదమో తెలుసా?



కప్పలు, బల్లులు, పాములు, సాలెపురుగులు, ఇతర క్రిమి కీటకాలను కోసిన పూలు, చిన్నచిన్న కుండీల్లో పెంచే చెట్ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా రవాణా అవుతున్నాయని, వీటివల్ల ప్రకృతికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.ఇలా తరలివస్తున్న జీవులలో... షెఫీల్డ్‌లోని ఒక పూల దుకాణంలో గులాబీ పూల నుంచి బయటపడ్డ కప్ప, యూరప్ ప్రధాన భూభాగంలో అలంకరణకు ఉపయోగించే ఆలివ్ మొక్కలలో పాములు దొరికాయి.ఇలా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివచ్చే జంతువులు, కీటకాలతో పంటలకు, గ్రామీణ ప్రాంతాల్లోని భూభాగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు చెప్పారు.మొక్కలకు, దుంపలకు, పూలకు ప్రపంచ మార్కెట్లలో బాగా డిమాండ్ ఉన్న సమయంలో, రవాణా ప్రమాణాలను తక్షణం మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

"ఇలా తరలి వచ్చే జీవుల్లో పాములు, బల్లులు కేవలం చిన్న భాగం మాత్రమే" అని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విల్లియం సదర్లాండ్ చెప్పారు. ఇవే ఇలా ఒకదేశం నుంచి మరో దేశానికి రాగలుగుతున్నప్పుడు ఇక చిన్నచిన్న కీటకాలు, ఫంగీలను గుర్తించే అవకాశం ఎంత?- అవి నిజంగా సమస్యలకు కారణం కావా? అని ప్రశ్నించారు.భౌగోళికంగా ముఖ్యంగా తూర్పు ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో అలంకరణ మొక్కల ఉత్పత్తి చాలా వేగంగా విస్తరించింది.చట్టాలు, సరిహద్దుల్లో తనిఖీలు ఉంటున్నప్పటికీ..పెద్ద ఎత్తున సాగే పూలు, అలంకరణ మొక్కల వాణిజ్యంతో దాని ద్వారా వచ్చే క్రిమి కీటకాలను, వ్యాధులను అడ్డుకోవడం చాలా కష్టమని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సిల్వియు పెట్రోవాన్ చెప్పారు.

షెఫీల్డ్‌లో ఒక పూల దుకాణంలో బతికున్న కప్పను గుర్తించాలని ఒకసారి క్షీరదాల నిపుణుడిని పిలిచారు.ఆయన దాన్ని ఫ్రాంక్ అనుకున్నారు. కానీ, నిజంగానే ఈక్వెడార్ మీదుగా కొలంబియా నుంచి వచ్చిన గులాబీల్లో ట్రీ-ఫ్రాగ్ (ఎక్కువ కాలం చెట్లపై పెరిగే కప్ప)ను గుర్తించి తాను షాకైనట్లు సదరు నిపుణుడు తెలిపారు.బ్రిటన్‌లో కప్పలు, బల్లులు, క్రిమి కీటకాలు ప్రధానంగా ట్రాన్స్‌పోర్ట్ అవుతున్నాయి. యూరప్‌లో, ఎన్నో అరుదైన సరీసృపాలు, ఉభయచర జీవులు దొరుకుతున్నాయి.కుండీల్లో పెంచే ఆలీవ్ మొక్కలలో గుర్తిస్తున్న జీవులు, జంతువులు.బల్లులు, యూరోపియన్ భూభాగంలో ఉండే పలు రకాల పాములు కప్పలు, కప్పలు మాదిరి ఉండే జీవులు పెద్ద సంఖ్యలో క్రిమి కీటకాలు అదొక అడవి దున్నల పుర్రెల పర్వతం, దాని వెనుక ఓ దారుణమైన కుట్ర కథ.

బయోసైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక రీసర్చ్ పేపర్‌లో, 2017-18 మధ్య కాలంలో నెదర్లాండ్స్‌లో కస్టమ్ అధికారుల తనిఖీల్లో అలంకరణ మొక్కల్లో దొరికిన కీటకాల రికార్డులను ఒక టీమ్ పరిశీలించింది.తమ పరిశీలనలను 2021-23లో యూకేలోని పర్యావరణం, ఆహారం, గ్రామీణ వ్యవహారాల విభాగానికి రిపోర్టు చేసింది.ఉత్పత్తి ప్రమాణాలను మెరుగుపర్చాలని, వాణిజ్యంలో ఉన్న నిర్దిష్ట ప్రమాదాల డేటాను సేకరించి,షేర్ చేయాలని వారు కోరారు.

అక్షర టైమ్స్

# మెటాకు కేంద్రం నోటీసులు

**ఆ ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనలను తక్షణమే తొలగించాలని ఆదేశాలు**

**ఇన్‌స్టాగ్రామ్‌లో అభ్యంతరకర ప్రకటనలపై కేంద్రం ఆగ్రహం**

**సంబంధిత ప్రకటనలు, కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశం**

**ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని మెటాకు నోటీసులు**




చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించేలా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటనలు కనిపిస్తున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. చిన్నారుల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్ ప్రోత్సహించే పెయిడ్ యాడ్స్‌తో పాటు సంబంధిత కంటెంట్‌ను వెంటనే తొలగించాలని మెటాను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ మెటాకు నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై ఏడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా సరైన సమాధానం ఇవ్వకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని తేల్చిచెప్పింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలకు అసలు ఎలా ఆమోదం లభించిందని కేంద్రం ప్రశ్నించింది. ప్రకటనల పరిశీలన, ఆమోద ప్రక్రియలో ఎక్కడ లోపాలు జరిగాయో వివరించాలని మెటాను కోరింది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారో కూడా తెలియజేయాలని ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి సాంకేతిక, భద్రతాపరమైన చర్యలు తీసుకుంటారో స్పష్టత ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా చిన్నారులకు హాని కలిగించే కంటెంట్‌ను గుర్తించడం, తొలగించడం, సంబంధిత ఖాతాలు, ప్రకటనదారులపై చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఓ మీడియా సంస్థ దర్యాప్తు కథనం నేపథ్యంలో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మెటాకు చెందిన రికమెండేషన్ అల్గారిథమ్ చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను ప్రోత్సహిస్తోందని ఆ కథనంలో ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అభ్యంతరకర ప్రకటనలు కూడా కనిపించినట్లు పేర్కొంది. మెటా ప్రకటనల విధానాల్లో నగ్నత్వం, లైంగికంగా అభ్యంతరకరమైన కంటెంట్‌పై స్పష్టమైన నిషేధం ఉంది. అయినప్పటికీ ఇలాంటి ప్రకటనలు ఎలా కనిపించాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కొన్ని పెయిడ్ యాడ్స్‌లో అభ్యంతరకర పదాలను ఉపయోగించడంతో పాటు.. వినియోగదారులను టెలిగ్రామ్ ఛానళ్ల వైపు మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయా ఛానళ్లలో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను విక్రయిస్తున్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వ్యవహారంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మెటా ప్రతినిధులను పిలిపించి వివరణ కోరాలని సూచించారు. ఆ తర్వాత కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ మెటాకు అధికారికంగా నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో థర్డ్ పార్టీ కంటెంట్ అనే వాదనతో మెటా బాధ్యత నుంచి తప్పించుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. సాధారణంగా సోషల్ మీడియా వేదికల్లో వినియోగదారులు పోస్ట్ చేసే కంటెంట్ విషయంలో మధ్యవర్తి సంస్థలకు కొన్ని చట్టపరమైన రక్షణలు ఉంటాయి. అయితే ప్రస్తుతం వచ్చిన ఆరోపణలు పెయిడ్ యాడ్స్‌కు సంబంధించినవని అధికారులు పేర్కొంటున్నారు. ప్రకటనల ద్వారా మెటాకు ఆదాయం వస్తున్నందున వాటి విషయంలో సంస్థకు బాధ్యత ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆరోపణలు నిజమని తేలితే ప్రకటనలను ప్రచురించిన వేదిక కూడా జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని స్పష్టం చేశాయి. ఈ అంశాన్ని సాంకేతిక, నియంత్రణ పరమైన కోణాల్లో కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ పరిశీలించనుంది. అదే సమయంలో చట్ట ఉల్లంఘనలు జరిగినట్లు భావిస్తే సంబంధిత ప్రకటనదారులు లేదా సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వ సంస్థలు, అధికారులు లేదా వ్యక్తులు కూడా ఫిర్యాదు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోంది. ఆన్‌లైన్ వేదికలు ఇలాంటి కంటెంట్‌ను వెంటనే గుర్తించి, తొలగించడంతో పాటు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేస్తోంది. డిజిటల్ ప్రపంచంలో చిన్నారులకు రక్షణ కల్పించేందుకు మరింత బలమైన భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సోషల్ మీడియా సంస్థలను కోరుతోంది. ఇంటర్‌పోల్ నుంచి అందిన సమాచారం ఆధారంగా చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ ఉన్న వెబ్‌సైట్లను కేంద్ర ప్రభుత్వం గతంలో పలుమార్లు బ్లాక్ చేసింది. సీబీఐ ద్వారా అందిన జాబితాల ఆధారంగా ఈ చర్యలు చేపట్టింది. హానికరమైన కంటెంట్‌ను నియంత్రించడంలో టెక్నాలజీ సంస్థలు విఫలమైతే నియంత్రణ సంస్థల విచారణతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్రం ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. కాగా, ఈ వారంలో మెటాకు కేంద్రం నోటీసులు జారీ చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం. వాట్సాప్‌లో తీసుకురావాలని భావిస్తున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పైనా కేంద్రం ఇటీవల అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇతరుల పేరుతో మోసాలకు పాల్పడే ఘటనలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌ను నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ వ్యవహారంపై కూడా మెటా ప్రతినిధులు ఐటీ మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కేంద్రం కోరిన విధంగా నిర్ణీత గడువులోగా సమగ్ర వివరణ ఇచ్చేందుకు సంస్థ సిద్ధమవుతున్నట్లు సమాచారం. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల వ్యవహారం కూడా తెరపైకి రావడంతో మెటాపై నియంత్రణ సంస్థల పరిశీలన మరింత పెరిగింది. చిన్నారుల భద్రతకు ముప్పు కలిగించే కంటెంట్, ప్రకటనల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కేంద్రం స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ఏడు రోజుల్లో మెటా ఇచ్చే వివరణ, ఆ తర్వాత ప్రభుత్వం తీసుకునే చర్యలు కీలకంగా మారనున్నాయి.

# ఎక్కువ ఆదాయం ఉంటే "క్రెడిట్ స్కోర్" పెరుగుతుందా

ప్రస్తుతం ఆర్థిక కార్యకలాపాల్లో "క్రెడిట్ స్కోర్" కీలకంగా మారింది. పర్సనల్, గోల్డ్, హోమ్ లోన్ ఇలాంటి ఎలాంటి రుణాలు తీసుకోవాలన్నా ఇది మెరుగ్గా ఉండడం చాలా అవసరం. లేదంటే కొన్నిసార్లు బ్యాంకులు లోన్ మంజూరు చేయకపోవచ్చు. అందుకే, అందరూ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరుచుకోవడానికి చాలా ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, మీకుండే అధిక ఆదాయం క్రెడిట్ స్కోర్‌పై ఎంతవరకు ప్రభావితం చేస్తుందనే విషయాన్ని తప్పక తెలుసుకోవాలంటున్నారు నిపుణులు. మరి, మీ ఆదాయం క్రెడిట్ స్కోరును ఎలా ప్రభావితం చేస్తుంది అందుకు తోడ్పడే ముఖ్యమైన అంశాలేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాంమీ అధిక ఆదాయం డైరెక్ట్‌గా క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపదంటున్నారు నిపుణులు. కానీ, ఆర్థిక వ్యవహారాలను నిర్వహించుకోవడానికి ఆదాయం చాలా అవసరం. మీకు ఇన్‌కమ్ బాగుంటే లోన్స్ మెరుగ్గా నిర్వహించ గలరు. దీనివల్ల ఆటోమెటిక్‌గా మీ స్కోరు పెరుగుతుందంటున్నారు. ఆదాయానికి, క్రెడిట్ స్కోరుకు మధ్య ప్రత్యక్ష సంబంధం లేనప్పటికీ, మీ క్రెడిట్ స్కోరును రూపొందించడంలో ఆదాయం పరోక్ష పాత్ర పోషిస్తుందని సూచిస్తున్నారు. ఇన్‌డైరెక్ట్‌గా క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే కొన్ని కీలకమైన ఆదాయ సంబంధ అంశాల గురించి ఇప్పుడు చూద్దాం.మీ మంత్లీ ఇన్‌కమ్‌లో ఎంత భాగం లోన్స్ కట్టడానికి వెలుతుందో తెలుసుకోవడానికి రుణఆదాయ నిష్పత్తి చాలా ముఖ్యం. ఇది మీ మంత్లీ లోన్ పేమెంట్స్‌ను ఆ నెల ఆదాయంతో పోలుస్తుంది. అంటే, మీ ఆదాయంలో ఎంత భాగం రుణాల చెల్లింపులకు వెళుతుందో, ఇతర ఖర్చుల కోసం ఎంత మిగిలి ఉంటుందో అంచనా వేయడానికి ఈ నిష్పత్తి రుణ సంస్థలకు యూజ్ అవుతుంది.మీ ఇన్‌కమ్ ఎక్కువగా ఉంటే, రుణఆదాయ నిష్పత్తి తక్కువగా ఉండే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణలు. మీకు ఇది ప్రయోజనకరం అనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే, బ్యాంకులు తక్కువ ఋ ఉన్న వారిని తక్కువ రిస్క్ ఉన్న రుణగ్రహీతలుగా భావిస్తాయి. అందుకే, ఇక్కడ మీకుండే ఎక్కువ ఆదాయం మీరు లోన్స్ పొందడంలో పరోక్షంగా సహాయపడుతుందంటున్నారు. మీ ఆదాయంతో ఎప్పుడైతే లోన్ పేమెంట్స్‌ను ఈజీగా నిర్వహిస్తారో మీ క్రెడిట్ స్కోరు కూడా మెరుగవుతుందని సూచిస్తున్నారు. అంటే, మీకుండే అధిక ఆదాయం పరోక్షంగా మెరుగైన క్రెడిట్ స్కోరును పొందేలా చేస్తుందంటున్నారు.క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాలలో సీయూఆర్ చాలా కీలకంగా ఉంటుంది. సీయూఆర్ అంటే ఏమిటంటే, మీకు అందుబాటులో ఉన్న క్రెడిట్‌లో మీరు ఉపయోగిస్తున్న శాతం. ఎప్పుడూ మీరు ఈ నిష్పత్తిని 30%, అంతకంటే తక్కువగా ఉండేలా చూసుకోవడం మంచిది. కార్డులపై ఎక్కువ వినియోగం, మీరు క్రెడిట్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నారని రుణ కంపెనీలకు సంకేతం ఇవ్వవచ్చు. ఇది మీ స్కోర్‌ను ప్రభావితం చేస్తుందని గుర్తుంచుకోవాలి. మీ ఆదాయం సీయూఆర్ నిష్పత్తిని నియంత్రించడానికి పరోక్షంగా యూజ్ అవుతుందంటున్నారు నిపుణులుఉదాహరణకు, మీ దగ్గర తగినంత ఇన్‌కమ్ లేనప్పుడు ఎక్కువగా క్రెడిట్ కార్డుపై ఆధారపడే ఛాన్స్ ఉండొచ్చు. దానివల్ల మీ క్రెడిట్ వినియోగ నిష్పత్తి అధికమవుతుంది. అదే మీకు మెరుగైన ఆదాయం ఉందనుకోండి. క్రెడిట్ వినియోగంపై అంతగా ఆధారపడరు. దీనివల్ల సీయూఆర్ మెరుగవుతుంది. ఇక్కడ కూడా మీకు ఉన్న అధిక ఆదాయం వల్ల మీరు క్రెడిట్‌పై అధికంగా ఆధారపడకుండా కాపాడి, క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉండేలా పరోక్షంగా సహాయపడుతుందని చెబుతున్నారు.మీ ఆదాయం క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో కట్టే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే, అధిక ఆదాయం ఉన్నప్పుడు ఇంటి కిరాయి, కిరాణా, యుటిలిటీల వంటి వాటికి పేమెంట్స్




కట్టాక కూడా మీ వద్ద ఉన్న ఆదాయంలో ఇంకా ఖర్చు చేయడానికి డబ్బు మిగిలి ఉంటుంది. దాంతో మీకు ఉండే లోన్స్, క్రెడిట్ కార్డుల బిల్లులను సకాలంలో కట్టడానికి వీలు కలుగుతుంది. ఇది పరోక్షంగా మీ క్రెడిట్ స్కోరుకు సానుకూలంగా ప్రభావితం చేస్తుంది.అదే, ఒకవేళ మీద వద్ద తక్కువ ఆదాయం ఉంటే, మీరు నెలవారీ చెల్లింపులు చేయడానికే ఇబ్బంది పడాల్సి వస్తోంది. దాంతో క్రెడిట్ కార్డు లేదా లోన్ చెల్లింపులు ఆలస్యం కావడం లేదా అసలు చేయకపోవడం జరగవచ్చు. చెల్లింపుల చరిత్రే మీ క్రెడిట్ స్కోర్‌లో అత్యంత ముఖ్యమైన అంశం. కాబట్టి, ఇది తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందంటున్నారు నిపుణులు. అందుకే, ఆదాయం మెరుగ్గా ఉండడం కూడా క్రెడిట్ స్కోరుకు ఒక సానుకూలమైన అంశమే అని చెప్పుకోవచ్చంటున్నారు నార్మల్‌గా రుణ సంస్థలు లోన్ అర్హతను అంచనా వేసేటప్పుడు మీ ఆదాయంలోని స్థిరత్వాన్ని, నిలకడను పరిగణనలోకి తీసుకుంటాయి. ఆదాయ స్థిరత్వం అనేది మంచి జాబ్ ఉపాధిపై ఆధారపడి ఉంటుంది. స్థిరమైన ఇన్‌కమ్‌తో కూడిన జాబ్ బిజినెస్ మీరు లోన్స్‌ను సమర్థంగా నిర్వహించగలరని తెలియజేస్తుంది. మీకు మంచి శాలరీ లభించే స్థిరమైన ఉపాధి ఉంటే, మీరు రుణాలు, క్రెడిట్ కార్డు బకాయిలను సమయానికి కట్టి, తద్వారా మీ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరుచుకుంటారని రుణ సంస్థలకు నమ్మకం కలుగుతుంది. అందుకే, మంచి ఇన్‌కమ్ లభించే ఉపాధి మెరుగైన క్రెడిట్ స్కోరుకు పరోక్షంగా సహాయపడుతుందంటున్నారు నిపుణులు.సహజంగానే ఎక్కువ ఆదాయం ఉండే వ్యక్తులు మెరుగైన ఆర్థిక భద్రతను కలిగి ఉంటారు. దీనివల్ల మెడికల్ బిల్లులు, ఇంటి రిపేరింగ్ లేదా ఉద్యోగం కోల్పోవడం వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి వీరికి వీలు కలుగుతుంది. ఎక్కువ ఆదాయం, ఆర్థిక క్రమశిక్షణ గలవారికి కొన్ని సమయాల్లో సమస్యలు ఉన్నాసరే, ఆర్థిక పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని డిఫాల్ట్స్ బారిన పడకుండా కాపాడుకుంటారు. కానీ, తక్కువ ఇన్‌కమ్ ఉన్నవారు ఊహించని ఖర్చులను ఎదుర్కోలేరు. రుణ చెల్లింపులపై డిఫాల్ట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. పరోక్షంగా, క్రెడిట్ స్కోరు దెబ్బతింటుందని నిపుణులు సూచిస్తున్నారు.


# అత్యంత విలువైన కంపెనీగా యాపిల్

**మళ్లీ ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా నిలిచిన యాపిల్**

**మార్కెట్ విలువలో ఎన్విడియాను అధిగమించిన టెక్ దిగ్గజం**

**యాపిల్ విలువ 4.88 ట్రిలియన్ డాలర్లు, ఎన్విడియా విలువ 4.86 ట్రిలియన్ డాలర్లు**

**ఎన్విడియా షేర్లు 3.9శాతం పడిపోవడంతో మారిన సమీకరణాలు**



సాంకేతిక రంగంలో అగ్రస్థానం కోసం జరుగుతున్న పోటీలో యాపిల్ సంస్థ మరోసారి పైచేయి సాధించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చిప్‌ల విక్రయాలతో గత కొంతకాలంగా దూసుకుపోతున్న ఎన్విడియాను వెనక్కి నెట్టి, ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ ట్రేడెడ్ కంపెనీగా యాపిల్ తన స్థానాన్ని పునరుద్ధరించుకుంది. శుక్రవారం నాటి ట్రేడింగ్ ముగిసే సమయానికి యాపిల్ మార్కెట్ విలువ సుమారు 4.88 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, ఎన్విడియా విలువ 4.86 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది.గత ఏడాది కాలంగా ఏఐ చిప్‌లకు పెరిగిన విపరీతమైన డిమాండ్‌తో ఎన్విడియా అగ్రస్థానంలో కొనసాగింది. అయితే, శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో ఎన్విడియా షేర్లు సుమారు 3.5 శాతం నుండి 3.9 శాతం వరకు క్షీణించడమే ఈ మార్పుకు ప్రధాన కారణమైంది. చైనాకు చెందిన 'మూన్‌షాట్' అనే స్టార్టప్, ఓపెన్‌ఏఐ వంటి దిగ్గజ సంస్థలకు సవాలు విసురుతూ సరికొత్త ఏఐ మోడల్‌ను ప్రకటించిందన్న వార్తలు ఎన్విడియా షేర్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. మరోవైపు, యాపిల్ షేర్లు మార్కెట్‌లో స్థిరత్వాన్ని కనబరిచాయి.చైనా మార్కెట్‌లో 'యాపిల్ ఇంటెలిజెన్స్' ఏఐ ఫీచర్లను ప్రవేశపెట్టేందుకు అక్కడి అధికారుల నుండి ఇటీవల అనుమతి లభించడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో, ఈ ఏడాదిలో ఇప్పటివరకు యాపిల్ షేర్లు సుమారు 22 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి.

## ఎఫ్‌డీలపై అధిక వడ్డీ ఇచ్చే "టాప్ 10 కంపెనీలు" ఇవే

**ఏ సంస్థలో ఎంత ఉందంటే ఎఫ్‌డీలపై బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ**

**ఏ కంపెనీ ఎంత వడ్డీ చెల్లిస్తుందంటే**




ప్రస్తుత రోజుల్లో చాలా మంది తాము సంపాదించే ఆదాయంలో ఎంతో కొంత భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేస్తున్నారు. అందులో భాగంగానే ఎక్కువమంది బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తుంటారు. అయితే, వీటి మాదిరిగానే నాన్ే ఉంటాయి. మరి, పెట్టుబడులపై అధిక రాబడినిచ్చే కంపెనీని ఎలా ఎంచుకోవాలి ప్రస్తుతం మంచి రేటింగ్ ఉన్న ప్రముఖ కంపెనీల్లో ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు ఏవిధంగా ఉన్నాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం పెట్టుబడిదారులు తమ పెట్టుబడులపై మంచి రాబడిని సంపాదించడానికి బ్యాంకులు, పోస్టాఫీసులతో పాటు చీదీఖీజ(నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ)లను ఎంచుకోవచ్చు. ఈ కంపెనీల్లో కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయొచ్చంటున్నారు నిపుణులు. అయితే, ఈ డిపాజిట్ల కాలవ్యవధి 1 నుంచి 5 సంవత్సరాలు ఉంటుంది. అలాగే, ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ఈ డిపాజిట్లపై వడ్డీ రేట్లు 1 నుంచి 1.50% అధికంగానే ఉన్నాయి. అంతేకాకుండా, కంపెనీలలో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై కూడా 0.25 నుంచి 0.50% వరకు అదనపు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి.భయపెడుతున్న "బాస్ స్కామ్"

## అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్రం హెచ్చరికలు

**కొత్త స్కామ్‌కు తెరలేపిన సైబర్ నేరగాళ్లు**

**ఈ విషయాల్లో జాగ్రత్తగా ఉండాలంటున్న కేంద్రం**



ఇటీవలి కాలంలో స్కామర్లు రోజురోజుకి కొత్త పన్నాగాలతో జనాలను బురిడీ కొట్టిస్తున్నారు. కంటికి కనిపించకుండానే అమాయక ప్రజల నుంచి డబ్బుల్ని దోచేస్తున్నారు. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా అంతా సైబర్ స్కామ్స్ బాధితులుగా మారిపోతున్నారు. అయితే, ఇప్పుడు కేటుగాళ్ల తమ పంథా మార్చారు. కంపెనీలే లక్ష్యంగా "బాస్ స్కామ్" పేరిట కొత్తరకం మోసాలకు తెరలేపారు. బాస్ పేరిట మెసేజ్‌లు పంపిస్తూ పెద్ద మొత్తంలో దోచుకుంటున్నారు. దీంతో పెద్ద పెద్ద సంస్థలూ వీటి నుంచి ఎలా తప్పించుకోవాలనే ఆలోచనలో పడ్డాయి. ఈ క్రమంలోనే ఈ తరహా మోసాల పట్ల వ్యక్తులు, కంపెనీలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వానికి చెందిన "సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఇంతకీ, బాస్ స్కామ్ అంటే ఏమిటి దీని ద్వారా ఎలా మోసగిస్తున్నారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే దీని బారినపడకుండా ఉండొచ్చు వంటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.సైబర్ కేటుగాళ్లు ఒక కంపెనీలోని సీఈవో లేదా ఇతర ఉన్నతోద్యోగుల పేర్లను వాడుకుని ఆ సంస్థలోనే పనిచేసే ఉద్యోగులను మోసం చేస్తుంటారు. ఆ విధానాన్నే "బాస్ స్కామ్" అంటారని చెబుతున్నారు నిపుణులు. దీని ముఖ్య ఉద్దేశం వచ్చేసి కింది స్థాయి ఉద్యోగుల నుంచి డబ్బులు బదిలీ చేయించుకోవడం లేదా సీక్రెట్ ఇన్ఫర్మేషన్‌ను దొంగిలించడం. ఎందుకంటే పై స్థాయి అధికారుల ఆదేశాలను నార్మల్‌గా ఉద్యోగులు తూ.చ. తప్పకుండా ఫాలో అవుతుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఈ కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారుసైబర్ నేరగాళ్లు ముందుగా కంపెనీ సీఈవోలు, ఉన్నతాధికారులను దోచుకునే ప్రయత్నం చేస్తారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి గవర్నమెంట్ కంట్రోల్ కంపెనీల పేరుతో సంస్థల సీఈవోలకు వాట్సాప్ లేదా ఇ-మెయిల్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తారు. నిబంధనల ఉల్లంఘనుకు పాల్పడ్డారంటూ ఒక జిప్ ఫైల్‌ను పంపిస్తారు. సీఈవో ఆ ఫైల్ ఓపెన్ చేయగానే మాల్‌వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశిస్తుందంటున్నారు నిపుణులు. చాలా కేసుల్లో సీఈవోలు ఆయా మెసేజ్‌లను తమ ఫైనాన్స్ ఆఫీసర్లు సెండ్ చేసినట్లు పేర్కొంది సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటం స్కామర్లు ఆ మాల్‌వేర్ ద్వారా వాట్సప్ వెబ్ సెషన్లను హ్యాక్ చేసి, వారి అఫీషియల్ కమ్యూనికేషన్లను తమ అధీనంలోకి తీసుకుంటారు. అనంతరం ఆ నంబర్ నుంచి ఫైనాన్స్ టీమ్‌కు సందేశాలు పంపి, ఎమర్జెన్సీగా మనీ ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆదేశిస్తారు. అందుకే, అనవసరం నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.అయితే, ఈ నాన్ ఫైనాన్షియల్ బ్యాంకింగ్ సంస్థల్లో డిపాజిట్ చేసేటప్పుడు వాటి క్రెడిట్ రేటింగ్‌లను తప్పక చూడాలని చెబుతున్నారు నిపుణులు. వాటి రేటింగ్‌ను బట్టి ఎంచుకోవడం ద్వారా పెట్టుబడిపై రిస్క్ తగ్గుతుందని సూచిస్తున్నారు. ముఖ్యంగా 'ూూూ' రేటింగ్ ఉన్న కంపెనీల్లో డిపాజిట్ చేయడం మంచిదంటున్నారు. వీటిల్లో డిపాజిట్లకు గ్యారెంటీ ఎక్కువని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

## కిటికల్ ఇల్‌నెస్ పాలసీ" గురించి తెలుసా

అనుకోని ఆపద సమయంలో అక్కరకు వస్తుందని ప్రస్తుతం చాలా మంది ఆరోగ్య బీమా తీసుకుంటున్నారు. అయితే, నేటి రోజుల్లో మారుతున్న జీవనశైలి కారణంగా వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు, క్యాన్సర్, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం సాధారణ హెల్త్ ఇన్సూరెన్స్ మనల్ని పూర్తి ఆర్థికంగా ఆదుకోలేదని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే ఈ పాలసీలు కేవలం ఆసుపత్రి ఖర్చులను మాత్రమే భరిస్తాయంటున్నారు. ఈ క్రమంలోనే దీర్ఘకాలిక చికిత్సలు, ఆదాయ నష్టం వంటి ఇతర ఖర్చులను తట్టుకోవడానికి క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలు ఎంతగానో అవసరం అంటున్నారు. అయితే, వీటిని ఎంచుకునేటప్పుడు, క్లెయిం చేసుకునేటప్పుడు కొన్ని కీలకమైన విషయాలు, ఇబ్బందులపై అవగాహన ఉండాలంటున్నారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.తీవ్ర ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెట్టినప్పుడు కేవలం హస్పిటల్ ఖర్చులు మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక మెడిసిన్ ఖర్చులు, కుటుంబ ప్రయాణాలు, అన్నింటికంటే ముఖ్యంగా బాధితుడి ఇన్‌కమ్ సామర్థ్యం తగ్గిపోవడం వంటి అనేక ఇతర ఖర్చులు ఎదురవుతాయంటున్నారు. సాధారణంగా తీవ్రమైన వ్యాధుల చికిత్స ఖర్చులు మిగిలిన వాటికంటే సగటున మూడు రెట్లు ఎక్కువగా ఉంటాయని.. ఈ ఖాళీని భర్తీ చేసేందుకే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలు అందుబాటులో ఉన్నాయంటున్నారు.ఈ పాలసీ ఎలా పనిచేస్తుంది : ఇది స్థిరమైన పరిహారం ఇచ్చే పాలసీ అంటున్నారు నిపుణులు. అంటే, పాలసీలో చెప్పిన ఏదైనా తీవ్రమైన వ్యాధి నిర్ధారణ జరిగిన వెంటనే, హాస్పిటల్ ఖర్చులతో సంబంధం లేకుండా, పాలసీలో ఉన్న పూర్తి మొత్తాన్ని బీమా సంస్థ ఒకేసారి పాలసీదారుడి చేతికి పరిహారం అందిస్తుందని, ఈ డబ్బును పాలసీదారుడు చికిత్స కోసం, లోన్లు క్లియర్ చేయడానికి, ఆదాయం లేని సమయంలో కుటుంబ అవసరాలకైనా ఉపయోగించుకోవచ్చంటున్నారు.ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య బీమా లేదా టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీకి అదనం ప్రీమియం చెల్లించి రైడర్‌గా జోడించుకోవచ్చంటున్నారు. దీనికి ప్రీమియం తక్కువగా ఉంటుంది. కానీ, ఇందులో ప్రాథమిక పాలసీ విలువ కంటే ఎక్కువ మొత్తానికి కవరేజీని ఎంచుకునే వీలుండదంటున్నారు. బేసిక్ పాలసీ గడువు ముగిస్తే, ఇదీ ముగుస్తుందని చెబుతున్నారు.పూర్తిగా స్వతంత్రంగా ఉండే స్టాండలోన్ క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీనీ ఎంచుకోవచ్చని సలహా ఇస్తున్నారు. ఇందులో ఎక్కువ మొత్తానికి కవరేజీ ఎంచుకునే వెసులుబాటు ఉంటుందని, వ్యాధుల జాబితా కూడా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను ఎంచుకునే ముందు నిబంధనలను పరిశీలించాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ధూమపానం, మద్యపానం, డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే వ్యాధులకు ఈ బీమా వర్తించదని అంటున్నారు. అలాగే పుట్టుకతో వచ్చే లోపాలు, ప్రసవ సంబంధిత సమస్యల్లాంటివి ఈ పాలసీ పరిధిలోకి రావంటున్నారు. ఇక కొన్ని రకాల క్యాన్సర్ల ప్రారంభ దశలో పాలసీ వర్తించదని.. వ్యాధి తీవ్రత పెరిగినప్పుడే క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.తీవ్ర వ్యాధులకు వర్తించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ తీసుకున్న వెంటనే క్లెయిం చేయడానికి వీలుండదని.. వెయింటింగ్ పీరియడ్ ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా పాలసీ ప్రారంభమైన మొదటి 3 నుంచి 6 నెలల వరకూ (నిబంధనల మేరకు) ఎలాంటి క్లెయిములు అంగీకరించరంటున్నారు.ఇక వ్యాధి నిర్ధారణ అయ్యాక కనీసం 30 రోజుల వరకూ జీవించి ఉండాలనే నిబంధనా కొన్ని పాలసీల్లో ఉంటుందని తెలుపుతున్నారు.రెన్యూవల్ విధానం ఇలా: ఆరోగ్య బీమా పాలసీలో ఏటా ప్రీమియం చెల్లించి రెన్యూవల్ చేసుకోవచ్చు. క్లెయిమ్ చేసుకున్నా పునరుద్ధరణకు ఇబ్బంది లేదు. కానీ క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ పూర్తిగా భిన్నం అంటున్నారు నిపుణులు. ఈ పాలసీలో ఒకసారి క్లెయిమ్ మొత్తం చెల్లించిన తర్వాత పాలసీ రద్దవుతుందని..



# ఈసారి కథ మారింది!

అగ్ర హీరో రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. దాదాపు గత ఏడాదిగా ఈ సినిమాపైనే దృష్టి పెట్టారు రామ్‌చరణ్. 'పెద్ది' హంగామా ముగియడంతో సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ చేయబోయే తదుపరి సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ రావడంతో తాజా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా లాంచింగ్ డేట్, ఇది ఏ జోనర్ కథాంశమనే విషయాలపై సోషల్‌మీడియాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం సెప్టెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్‌ను దర్శకుడు సుకుమార్ లాక్ చేశారని సమాచారం. అందరూ అనుకుంటున్నట్లుగా ఇది'రంగస్థలం' తరహా రూరల్ డ్రామా కాదని, రామ్‌చరణ్ కోసం దర్శకుడు సుకుమార్ ఈసారి సరికొత్త కథను సిద్ధం చేశారని, నగర నేపథ్యంలో స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందనుంది.



# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?

'కేజీఎఫ్'తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. 'హను-మాన్' విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో 'జై హనుమాన్'ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటేనే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.

# రాకా కోసం దీపిక సాహసం?

ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం. అంతేకాదు, తన 'ఎనిమిది గంటల పని' నిబంధనను కూడా ఈ సినిమా విషయంలో ఆమె పక్కన పెట్టారని తెలిసింది. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందు, 'రాకా'లో తన పార్ట్ షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేయాలని ఆమె నిర్ణయించారట. అటు షూట్‌లో పాల్గొంటూనే ఇటు తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటూ, లొకేషన్‌లో నటిగా, తల్లిగా రెండు బాధ్యతలనూ నిర్వర్తిస్తూ అందరి దృష్టినీ దీపిక ఆకర్షించారట. దీపిక తన జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకునే తీరును చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిస్తున్నారు.





# రాజు.. జాకీ.. రాణి

1990ల కాలంలో సాగే పీరియడ్ క్రైమ్ డ్రామా 'కేజేక్యూ'. 'ఖఅఅస్త్ర జీుఎఎఅవ ఁబవవఅ' అనేది ఉపశీర్షిక. దసరా, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్‌శెట్టి హీరోగా, శశి ఓదెల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి స్వర్గీయ కె.కె దర్శకుడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ చిత్ర దర్శకుడు కేకే గత ఏడాది కన్ను మూశారు. ఆయనకు సినిమాపై ఉన్న పాషన్, విజన్‌కి నివాళిగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే ప్రచార చిత్రాల వల్ల సినిమాపై అంచనాలు పెరిగాయని, సినిమా తప్పకుండా ప్రేక్షకులకు ఓకొత్త అనుభూతినిస్తుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. యుక్తి తరేజా కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెస్, సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com